జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 17 జనవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 290 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528




చైనాకు చెక్ పెట్టేందుకు

## భారత్ రెడీ

- స్పేస్‌లో అడుగుపెట్టే ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
- యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతం
- భారత అంతరిక్ష ప్రయోగాలను మరో మలుపు తిప్పగలిగే సంక్లిష్ట ప్రయోగం సక్సెస్ కావడంతో.. అంతటా ప్రశంసలు

# అదే నా గోల్

## నిరంతరం పనిచేస్తా

- పండుగల సంస్కృతిని కాపాడటమే అందరి బాధ్యత
- తెలుగువారు గ్లోబల్‌గా ఎదుగుతున్నారు
- గతంలో సంక్రాంతికి ఇప్పటి సంక్రాంతికి రాష్ట్రంలో రోడ్లలో తేడా స్పష్టంగా కనిపించింది
- అందరినీ ఫ్రీ వదిలివేశాం... వాళ్ళు కూడా ఆనందంగా ఉన్నారు.
- ఏపీకి పోలవరం జీవనాడి.. కానీ వైసీపీ హయాంలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు
- గత పాలకులు రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి**

పండుగల సంస్కృతిని కాపాడటమే అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ జీఎస్డీపీ ఫస్ట్ అడ్వాన్స్ ఎస్టిమెట్ 2024-25పై సీఎం మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు సరిహద్దుల్లో ఉండటంతో రాయలసీమలో జల్లికట్టు ఉండేదని.. గ్రామాలకు ఈ సారి 10 లక్షల మంది వచ్చారని తెలిపారు. తమ మూలాలను గుర్తు పెట్టుకోవడం మంచి అలవాట న్నారు. తెలుగువారు గ్లోబల్‌గా ఎదుగుతున్నారన్నారు. గతంలో సంక్రాంతికి ఇప్పటి సంక్రాంతికి రాష్ట్రంలో రోడ్లలో తేడా స్పష్టంగా కనిపించిందన్నారు. అందరినీ ఫ్రీ వదిలివేశాం... వాళ్ళు కూడా ఆనందంగా ఉన్నారని సీఎం అన్నారు. ఏపీకి పోలవరం జీవనాడి అని.. కానీ వైసీపీ హయాంలో పోలవరాన్ని - మిగతా 3లో



## ఏపీకి ఆసియాలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టు

- రూ.10 వేల కోట్లతో ప్లాంట్ పెట్టడానికి రిలయన్స్ ఎన్‌యూ సన్‌టెక్ సంసిద్ధత
- కర్నూలు జిల్లాలో భూములను పరిశీలించిన ప్రతినిధులు
- ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ దశలో 1,000 మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది
- 25 ఏళ్ల కాలానికి విద్యుత్తు కొనుగోలు చేసేలా సెకి ఒప్పందం కుదుర్చుకోనుంది

**అమరావతి**

ఆసియాలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానుంది. రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 930 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్‌తో పాటు 465 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి రిలయన్స్ ఎన్‌యూ సన్‌టెక్ ఇటీవల కర్నూలు జిల్లాలో రెండు స్థలాలను పరిశీలించింది. త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. సౌర విద్యుత్తు ప్లాంట్ : ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ దశలో 1,000 మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సెకితో కలిసి ఎన్‌యూ సన్‌టెక్ చేపట్టే ఈ ప్రాజెక్టును 24 నెలల్లో ప్రారంభించాల్సి ఉంటుంది. 25 ఏళ్ల కాలానికి విద్యుత్తు - మిగతా 3లో



ఛత్తీస్‌గఢ్‌లో

## ఎన్‌కౌంటర్

- 17 మంది నక్సల్స్ హతం..!
- నక్సలైట్లకు గట్టి ఎదురుదెబ్బ
- దక్షిణ బస్తర్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్
- అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో యాంటీ నక్సల్ ఆపరేషన్

## ఉద్యోగుల కోసం 8వ పే కమిషన్ ఏర్పాటు

- శ్రీహరికోటలో కొత్త లాంచ్ ప్యాడ్ నిర్మాణం
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- 1947 నుంచి ఇప్పటివరకు 7 వేతన సంఘాలు ఏర్పాటు
- ప్రస్తుతం ఉన్న పే కమిషన్ 2016లో ఏర్పాటు అయింది
- ఆ వేతన సంఘం గడువు 2026లో ముగుస్తుంది





## ఏపీకి కొత్త పరిశ్రమలు

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ ముందుకు దూసుకెళ్తుంది
- మహిళలకు మూడు సిలిండర్లు, 64 లక్షల మందికి 30వ తేదీన పెన్షన్లు ఇస్తున్నాం
- వెనక్కి వెళ్లిన పరిశ్రమలన్నీ తిరిగి మళ్లీ రాష్ట్రానికి వస్తున్నాయి..
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

# కార్యకర్తే అధినేత

## కోటి దాటిన పసుపు సైన్యం.. కార్యకర్తలకు నారా లోకేశ్ లేఖ

- రాష్ట్ర వ్యాప్తంగా 11 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వాల సంఖ్య లక్ష మార్కు దాటింది
- మరో 105 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యుల సంఖ్య 50 వేల మార్కు దాటింది.
- సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ఒక పండగలా నిర్వహించారు




**ఇంటర్నెట్ డెస్క్**

తెలుగు దేశం పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించింది. 1,00,52,598 సభ్యత్వాలతో మరో అధ్యయనం ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 11 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వాల సంఖ్య లక్ష మార్కు దాటింది. మరో 105 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యుల సంఖ్య 50 వేల మార్కు దాటింది. మరోవైపు, పార్టీని నమ్ముకున్న కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ నిధి సారధి నారా లోకేశ్ విప్లవాత్మక అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో కార్యకర్తలకు ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచుతూ యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌తో పార్టీ ఒప్పందం కుదుర్చుకుంది కోటి సభ్యత్వాల మార్క్ దాటిన సందర్భంగా కార్యకర్తలను - మిగతా 3లో



## ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్

- తొమ్మిదేళ్ల ప్రస్థానంలో కీలక మైలురాయి
- భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ
- స్టార్టప్ ఇండియా, రాష్ట్ర-స్థాయి విధానాలు, అలాగే పెరుగుతున్న ప్రతిభ, డిజిటల్ కనెక్టివిటీ వంటి ప్రభుత్వ కార్యక్రమాలతో మౌలిక సదుపాయాల బలమైన మద్దతు
- భారతీయ స్టార్టప్‌లు దేశీయ సవాళ్లను పరిష్కరించడమే కాకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరిస్తున్నాయి
- తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగలగడం భారత్‌లోనే సాధ్యపడుతోంది

# చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ రెడీ




భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో ఘనత. గురువారం (జనవరి 16, 2025) తెల్లవారుజామున తొలిసారి అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసి చారిత్రాత్మక విజయం సాధించింది. యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత డాకింగ్ ప్రయోగం విజయవంతం చేసిన నాలుగో దేశంగా నిలిచింది. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది ఇస్రో. భారత అంతరిక్ష ప్రయోగాలను మరో మలుపు తిప్పగలిగే సంక్లిష్ట ప్రయోగం సక్సెస్ కావడంతో.. అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు, చంద్రునిపై మానవున్ని పంపేందుకు ఈ సాంకేతికత చాలా అవసరం. గతేడాది డిసెంబర్ 30న శ్రీహరి కోట లాంచ్ ప్యాడ్ నుంచి పీఎస్ఎల్‌బిసి60 ద్వారా 220 కిలలోల బరువున్న రెండు ఉపగ్రహాలు ఎస్‌డిఏక్స్01(ఛేజర్) ఎస్‌డిఏక్స్02(టార్గెట్)లను నింగిలోకి పంపించింది ఇస్రో. ఒకే రాకెట్‌పై ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లగానే విడిపోయాయి. వాస్తవానికి డాకింగ్ ప్రక్రియ జనవరి 7న షెడ్యూల్ చేయబడినప్పటికీ అనేక మార్లు వాయిదా పడింది. చివరకు జనవరి 16న అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానించి.. యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత అంతరిక్షంలోడాకింగ్ ప్రయోగం విజయవంతంగా అమలు చేసిన నాలుగో దేశంగా నిలిచి చరిత్ర సృష్టించింది.

ఈ సందర్భంగా, "రాబోయే సంవత్సరాల్లో భారతదేశం చేపట్టబోయే ప్రతిష్టాత్మక అంతరిక్ష యాత్రలకు ఇది ఒక ముఖ్యమైన మెట్టు" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు."భవిష్యత్తులో భారత అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్ 4, గగన్‌యాన్ ఆశయాలను సాధించేందుకు స్వదేశీ భారత డాకింగ్ సిస్టం విజయం బాటలు వేసిందని" కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ ఇస్రో బృందాన్ని ప్రశంసించారు.

**డాకింగ్ అంటే ఏమిటి? ఎందుకంత ప్రాధాన్యం?**

అంతరిక్షంలో వేగంగా సంచరిస్తున్న రెండు ఉపగ్రహాలను మాన్యువల్‌గా లేదా వాటంతటఅవే ఒకే కక్ష్యలోకి తీసుకురావడాన్ని 'డాకింగ్ ప్రక్రియ' అంటారు. ఉదాహరణకు అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ నిర్మించుకునేందుకు భారీ మాడ్యుల్స్ భూమి నుంచి పంపడం సాధ్యం కాదు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే భారీ అంతరిక్ష నౌకలు అవసరమయ్యే మిషన్లను నిర్వహించడం సులభమవుతుంది. స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటుకే కాక ప్రత్యేక మాడ్యూల్స్ అంతరిక్షంలో కలిపేందుకు, సిబ్బందిని, సామాగ్రిని తీసుకెళ్లడానికి కూడా ఈ సామర్థ్యం అవసరం.

**డాకింగ్ ప్రయోగం విజయవంతం చేసిన దేశాలు..**

యునైటెడ్ స్టేట్స్: 1966లో నాసా ప్రయోగించిన జెమినీ లక్ష్యవాహక నౌక అజేనాతో డాకింగ్ చేసిన మొదటి అంతరిక్ష నౌకగా నిలిచింది. ఈ మిషన్ 1969లో చంద్రునిపై అడుగు పెట్టిన మొదటి మానవుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ నేతృత్వంలో జరిగింది.

సోవియట్ యూనియన్: 1967లో సోవియట్ యూనియన్ మానవరహిత కాస్మస్ 186, కాస్మస్ 188లను ఆటోమేటెడ్ విధానంలో విజయవంతంగా ప్రయోగించింది. చైనా: 2011 లో మానవరహిత షెంజౌ 8 వ్యోమనౌకను టియాంగాంగ్ 1 అంతరిక్ష ప్రయోగశాలతో విజయవంతంగా డాక్ చేసి చైనా తన డాకింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఒక సంవత్సరం తర్వాత చైనా వ్యోమగాములు మాన్యువల్‌గా షెన్‌జౌ 9 వ్యోమనౌకను అదే అంతరిక్ష ప్రయోగశాలతో డాక్ చేశారు.

**భారతదేశం స్పేడెక్స్ డాకింగ్ మిషన్‌ను ఎందుకు నిర్వహించింది?**

2035 నాటికి అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 2040 నాటికి మానవులను చంద్రునిపైకి పంపాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అవసరమయ్యే సాంకేతికతలు సమకూర్చుకోవడంలో భాగంగా ఈ స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం చేపట్టి విజయవంతంగా పూర్తిచేసింది. హెవీ-లిఫ్ట్ లాంచ్ వెహికల్‌తో పాటు 30 టన్నుల బరువును భూమి సమీప కక్ష్యకు మోసుకెళ్లాలంటే డాకింగ్ సామర్థ్యం అవసరం. భారతీయ అంతరిక్ష్ స్టేషన్ నిర్మించేందుకు 5 రకాల మాడ్యూళ్లను అంతరిక్షంలోకి పంపాలని భావిస్తోంది. ఇందులో మొదటిదైన రోబోటిక్ మాడ్యూల్ 2028లో లాంచ్ చేయనుంది. చంద్రయాన్ 4 ప్రయోగం ద్వారా చంద్రునిపై నుంచి నమూనాలు సేకరించాలని భావిస్తోంది ఇస్రో. ఇందుకోసం రెండు వేర్వేరు ప్రయోగాల ద్వారా ఐదు కీలక మాడ్యూళ్లను కక్ష్యలోకి పంపాలని ప్రణాళికలు రచిస్తోంది. మొదటి ప్రయోగంలో నాలుగు మాడ్యూళ్లను పంపిస్తారు. ప్రొపల్షన్ మాడ్యూల్ భూమి కక్ష్య నుండి చంద్రుని కక్ష్యకు అంతరిక్ష నౌకను మోసుకువెళుతుంది, అక్కడ నుంచి ల్యాండర్, అసెండర్ మాడ్యూళ్లు చంద్రుని ఉపరితలంపైకి వెళ్లి నమూనాలను సేకరిస్తాయి. ఆ నమూనాలను తీసుకెళ్లి అసెండర్ మాడ్యూల్ చంద్రుని కక్ష్యలోని ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్‌కు డాక్ చేస్తుంది. తర్వాత ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్ ఆ నమూనాలను భూమి కక్ష్యకు తీసుకొస్తుంది. అక్కడ రీ-ఎంట్రీ మాడ్యూల్‌తో డాక్ అయ్యి విడిగా లాంచ్ అవుతుంది. భూ వాతావరణంలోని వేడిని తట్టుకునేలా ఈ మాడ్యూల్‌ను రూపొందించనున్నారు. ఈ మిషన్‌కు సన్నాహకంగా, చంద్రయాన్-3 మిషన్ ముగింపు సమయంలో ఇస్రో "హాప్ ప్రయోగం" చేసింది

**భారతీయ డాకింగ్ సిస్టమ్ అంటే ఏమిటి?**

కొన్నేళ్లుగా స్పేస్ ఏజెన్సీలు కొన్ని ఇంటర్‌ఆపరేబిలిటీలతో కలిపి అనేక రకాల డాకింగ్ మెకానిజమ్‌లు ఉపయోగిస్తున్నాయి. ఇంటర్నేషనల్ డాకింగ్ సిస్టమ్ స్టాండర్డ్ ని అనుసరించి వ్యోమనౌకలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళతాయి. ఇది మొదట 2010లో బేస్‌లైన్ చేయబడింది. భారతదేశం ఉపయోగించే డాకింగ్ మెకానిజం ఆండ్రోజినస్ - అంటే ఛేజర్, టార్గెట్ శాటిలైట్‌లలోని సిస్టమ్‌లు ఒకేలా ఉంటాయి. ఇది ఇతర ఏజెన్సీలు ఉపయోగించే %×ఖూూ% మాదిరిగానే ఉంటుంది. అయితే %×ఖూూ%లో 24 ఉపయోగిస్తే, ఇక్కడ రెండు మోటార్‌లనే వాడతారు. ఈ మిషన్‌లో రెండు ఉపగ్రహాలను దగ్గరకు తీసుకువచ్చి కలిపేందుకు లేజర్ రేంజ్ ఫైండర్, రెండెజ్‌వూస్ సెన్సార్, ప్రాక్సిమిటీ, డాకింగ్ సెన్సార్ వంటి అనేక కొత్త సెన్సార్‌లను ఉపయోగించారు.

# ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్

సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం భారత ప్రభుత్వం ప్రారంభించిన "స్టార్టప్ ఇండియా" దేశాన్ని 3వ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా తీర్చిదిద్దింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ రంగాల్లో సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే యువతను ప్రోత్సహించడం కోసం ఏర్పడిన స్టార్టప్ ఇండియా 2025 జనవరి 16 నాటికి తొమ్మిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని 10వ ఏటలోకి అడుగు పెడుతోంది. ఈ సందర్భంగా జనవరి 16ను కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్టార్టప్ డే గా పేర్కొంటూ.. తొమ్మిదేళ్ల ప్రయాణంలో అధిగమించిన మైలురాళ్లు, సాధించిన విజయాలను వెల్లడించింది.

భారత ప్రభుత్వం "స్టార్టప్ ఇండియా" పేరుతో సరికొత్త ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక వనరులు కల్పించడం, వివిధ శాఖల నుంచి అనుమతులు కల్పించడంలో సహకరిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. దీనికి తోడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఇంజనీరింగ్, సైన్స్ రంగాల్లో చదువుకున్న యువత కూడా పెద్ద సంఖ్యలో ఉండడం కలిసొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం కల్గిన మానవ వనరులే భారతదేశానికి ఒక ఆస్తిలా మారాయి. వీటన్నింటికీ మించి ప్రపంచంలోని ఏ ఇతర దేశంతో పోల్చినా సరే ఇక్కడ తక్కువ ఖర్చుతో కంపెనీలను ఏర్పాటు చేయడం, తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగల్గడం భారత్‌లోనే సాధ్యపడుతోంది. ఇవన్నీ ప్రస్తుతం భారత్‌ను స్టార్టప్ ఎకోసిస్టమ్‌లలో 2-3 స్థానాల్లో నిలబెడుతోంది. మొదటి స్థానంలో అమెరికా కొనసాగుతుండగా.. 2-3 స్థానాల్లో భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ అటూ ఇటుగా కొనసాగుతున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో కెనడా, జెర్మనీ ఉన్నాయి.

డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ గణాంకాల ప్రకారం 9 సంవత్సరాల క్రితం



భారతదేశంలో కేవలం 500 స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు 1.59 లక్షల స్టార్టప్ కంపెనీలు, వాటిలో 100కు పైగా యూనికార్న్ కంపెనీలతో ప్రపంచస్థాయిలో భారతదేశం దూసుకుపోతోంది. ఈ తొమ్మిదేళ్లలో 16 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించిన రంగంగా రికార్డుల్లో నిలిచింది. జొమాటో, ఓలా, జీరోదా, జెప్టో, బ్లింకిట్, కంట్రీ డిలైట్ వంటి నిత్యజీవితంలో ఉపయోగించే అనేక రకాల ఈ-కామర్స్, ఫిన్‌టెక్ యాప్స్ అన్నీ స్టార్టప్‌లే అన్న విషయం మరువరాదు. ఇవన్నీ స్థానిక మార్కెట్లో అనేక సవాళ్లను పరిష్కరించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొదాయి. దేశ ముఖచిత్రాన్ని మార్చేసి, ఆర్థిక పురోగతిలో భాగమయ్యాయి.

**స్టార్టప్ ఇండియాలో కొన్ని విశేషాలు**

భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య 1,59,157

2024 అక్టోబర్ నాటికి మొత్తం 73,151 గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు.

ఈ 9 సంవత్సరాలలో, గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 16.67 లక్షల ఉద్యోగాలను సృష్టించాయి

ఏయే రంగాల్లో సృష్టించిన ఉపాధి ఎంత?

ఐటీ సేవలు - 2.04 లక్షలు

హెల్త్ కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ - 1.47 లక్షలు

వృత్తిపరమైన, వాణిజ్య సేవలు - 94, 060

విద్య - 90, 414

స్టార్టప్ ఇండియా చొరవ ప్రత్యేకత ఏమిటి?

వ్యాపారాన్ని సులభంగా చేయడం: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో వ్యాపారాలను ప్రారంభించడం సులభతరం చేయడం

పన్ను ప్రయోజనాలు: స్టార్టప్ ప్రారంభించే వారికి వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.

నిధుల మద్దతు: స్టార్టప్‌ల కోసం రూ. 10,000 కోట్ల విలువైన నిధుల నిధి అందుబాటులో ఉంది.

వివిధ రంగాలకు ప్రత్యేక విధానాలు: బయోటెక్నాలజీ, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు సంబంధించిన కేంద్రీకృత విధానాలు.

'డెవలప్డ్ ఇండియా యంగ్ లీడర్స్ డైలాగ్'లో భారతదేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత విస్తరించాలని ప్రధానమంత్రి మోదీ కోరుకున్నారు. నేటి భారతదేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. నేడు భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని, అదే సమయంలో నేడు ప్రపంచంలోనే నంబర్ వన్ ఫిన్‌టెక్ ఎకో సిస్టమ్ భారతదేశంలో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా భారత్ నిలవడం గర్వంగా ఉందని తెలిపారు. అలాగే భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా కొనసాగుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో భారతదేశం ప్రపంచ అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని, ఇది ప్రపంచ వృద్ధి ఇంజిన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కారులో కట్టలు.. లెక్క పెట్టడానికే..

న్యూఢిల్లీ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లోని కోశంబి జిల్లాలో ఎన్నో నేరాలు చేసిన గ్యాంగ్‌స్టర్ నక్కు యాదవ్.. తన పేరును నందలాల్ యాదవ్‌గా మార్చుకొని నకిలీ పత్రాలు సృష్టించుకొని పోలీస్ శాఖలో దాదాపు 35 ఏళ్ల పాటు హోంగార్డ్‌గా విధులు నిర్వహించాడు. అతడి బండారం కాస్తా ఇటీవల బహిర్గతమైంది. దీంతో ప్రజలే కాదు.. పోలీస్ శాఖ సైతం ముక్కున వేలేసుకొంది. తాజాగా మరో ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆర్టీవో కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన సౌరభ్ శర్మ వందల కోట్ల ఆస్తులు చూసి.. ఆ రాష్ట్ర రాజకీయాల్లో సైతం అలజడి మొదలైంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. భోపాల్ నగర శివారులోని మెండోరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్.. తన పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నాడు. ఇంతలో ఆ సమీపంలో ఇన్నోవా కారును పార్క్ చేసి.. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. అయితే వారు కారు నెంబర్ ప్లేట్ తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో మాజీ సర్పంచ్‌కు కాస్తా ఆసక్తి కలిగింది. కొన్ని రోజులుగా ఆ కారు అక్కడ ఉంది. దీనిని తీసుకు వెళ్లేందుకు ఎవరు రాలేదు. కారు సమీపంలోని వెళ్లి చూస్తే.. కారు ప్లేట్ మీద ఆర్‌టీవో అని రాసి ఉంది. కారు అద్దాల్లో నుంచి లోపలికి చూశాడు. అందులో భారీ ఎత్తున బ్యాగులు ఉన్నట్లు గుర్తించాడు. దీంతో స్థానిక రాతిబాది పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో పోలీసులు హుటాహుటిన కారు వద్దకు వచ్చి పరిశీలించారు. ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించారు. వారి సమక్షంలో కారు అద్దాలు పగల కొట్టగా.. అందులో భారీగా నగదు, కిలోల కొద్ది బంగారాన్ని ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కారు ఆర్టీవో కార్యాలయంలో విధులు నిర్వహించిన సౌరభ్ శర్మదిగా గుర్తించారు. దీంతో అతడి నివాసంపై లోకాయుక్త పోలీసులు, ఐటీ, ఈడీ అధికారులు దాడులు చేసి కోట్లాది రూపాయిలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కారు సౌరభ్ శర్మ స్నేహితుడి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. ఇక సౌరభ్ శర్మతోపాటు అతడి స్నేహితులు సైతం పరారీలో ఉన్నట్లు గమనించారు. మరోవైపు సౌరభ్ తండ్రి ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వర్తించే వారు. ఆయన ఉద్యోగంలో ఉండగానే మరణించారు. దీంతో కారుణ్య నియామకం కింద 2015లో ఆర్టీవో కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సౌరభ్ శర్మకు ప్రభుత్వం మంజూరు చేసింది. 2015లో అతడు వీఆర్ఎస్ తీసుకున్నాడు. తనకున్న పరిచయాలతో అతడు రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగు పెట్టాడు. ఈ నగదంతా సౌరభ్ శర్మతోపాటు అతడి స్నేహితులు హవాలా మార్గంలో సంపాదించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మంది నక్సలైట్లు హతమయ్యారు. బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పూజారీ కాంకేర్, మారేడుబాక ప్రాంత అడవుల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఇరుపక్షాల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఈ నెలలో ఇది రెండో ఎన్‌కౌంటర్. మూడు జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), ఐదు బెటాలియన్ల సీఆర్పీఎఫ్, కోబ్రా, సీఆర్పీఎఫ్ 229వ బెటాలియన్ బలగాలు నక్సల్స్ ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఇదే జిల్లాలో ఈ నెల 12న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సల్స్‌తోపాటు ఐదుగురు నక్సలైట్లు మరణించారు.

## గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ:** 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమనని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. 2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్-6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది. అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరఫున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశానని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

## ఉద్యోగుల కోసం 8వ పే కమిషన్ ఏర్పాటు



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనదారులకు మోదీ సర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

"1947 నుంచి ఇప్పటివరకు 7 వేతన సంఘాలు ఏర్పాటు అయ్యాయి. జాప్యానికి తావులేకుండా వేతన సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి సంకల్పించుకున్నారు. అందుకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఉన్న పే కమిషన్ 2016లో ఏర్పాటు అయింది. ఆ వేతన సంఘం గడువు 2026లో ముగుస్తుంది. ఆ గడువుకన్నా ముందే, 2025లోనే 8వ వేతన సంఘం ఏర్పాటు చేయడం ద్వారా సరిపడా సమయం దొరుకుతుంది. 7వ పే కమిషన్ గడువు ముగియడానికి ముందే వేతనాల పెంపుపై సిఫార్సుల పొందేందుకు వీలు కలుగుతుంది. కొత్త కమిషన్?కు ఛైర్మన్?, ఇద్దరు సభ్యులను త్వరలోనే నియమిస్తాం" అని కేంద్ర మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని- ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.

**ఇస్రోకు మరింత శక్తి**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం-షార్‌లో మూడో లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం రూ.3,985కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టగల నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికిల్-ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలకు వీలు కల్పించే కొత్త లాంచ్‌ప్యాడ్ నిర్మాణాన్ని రోదసీ పరిశోధన రంగానికి అవసరమయ్యే మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక మైలురాయిగా అభివర్ణించారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం- భారత్ త్వరలో చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు షార్‌లో కొత్తగా నిర్మించబోయే లాంచ్‌ప్యాడ్ ఉపకరించనుంది. ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలు మాత్రమే కాక- సెమీక్రయోజనిక్ స్టేజ్‌తో కూడిన ఎల్‌వీఎమ్3 ప్రయోగాలకూ వేదిక కానుంది. నాలుగేళ్లలో మూడో లాంచ్‌ప్యాడ్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# అదే నా గోల్..

-మొదటిపేజీ తరువాయి

గోదావరిలో కలిపేశారని మండిపడ్డారు. గత పాలకులు రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రానికి రావాలంటే భయపడ్డారన్నారు. పారిశ్రామిక వేత్తలను కూడా భయపెట్టారని తెలిపారు. సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచుతామని.. ఆదాయం పెరిగితే పేదవాళ్ళకు సంక్షేమ పథకాలను అమలు చేసి పెద్దవాళ్ళను పైకి తీసుకురావచ్చని చెప్పుకొచ్చారు. అప్పట్లో ఆర్థిక సంస్కరణలు ఫలితాలను ఇచ్చాయన్నారు. తాను వాటిని మనసా వాచా నమ్మానన్నారు. విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి వెలుగులు పెంచానని.. కానీ తాను అధికారాన్ని కోల్పోయానని తెలిపారు. ఐటీని తీసుకువచ్చానని... ఈరోజు ఐటీ అనేక కుటుంబాల్లో జీవనోపాధి కలిపించిందన్నారు.

**అప్పుడు ఎగతాళి చేశారు.. కానీ ఇప్పుడు**

హైదరాబాద్.. ఇండియాలో నెంబర్ 1 అయ్యి తెలంగాణకు బ్యాక్ బోన్‌గా మారిందని.. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా అత్యధిక తలసరి ఆదాయం వస్తుందన్నారు. ఐటీ తిండి పెడుతుందా అని చాలా మంది ఎగతాళి చేశారని.. ఐటీ ఇప్పుడు ఎక్కడికో తీసుకెళ్తోందన్నారు. సంపద పెంచితే ఆదాయం పెరిగి సంక్షేమ పథకాల అమలుకు అవాకాశం ఉంటుందని.. ఇదే తాను నమ్మిన సిద్ధాంతమన్నారు. ఆర్థిక సంస్కరణలు అప్పట్లో వేరే మార్గం లేకుండా చేశారని.. అయితే రెండో తరం సంస్కరణలను తాను మొదలుపెట్టినట్లు తెలిపారు. పవర్ సెక్టార్ రిఫార్మ్స్, విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, రోడ్లకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు నుంచి చెన్నైకి తరువాత గోల్డెన్ క్వాడ్రలైటరల్‌లు వచ్చాయని... సంపద వచ్చింది ఆదాయం పెరిగిందని తెలిపారు.



**జీఎస్‌డీపీ ముఖ్యం..**

“నేను పెన్షన్ పెంచాను.. దీని వలన వారిని చూసేందుకు పిల్లలు ముందుకు వస్తున్నారు. మనుషులను మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులను అందరినీ కనెక్ట్ చేస్తున్నాను. ఇల్లు అన్నింటికీ జియో ట్యాగింగ్ చేయిస్తున్నాను. ఎందుకంటే ఇవన్నీ కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసమే. పీ - 4 అనేది ఒక గేమ్ చేంజర్‌గా మారుతుంది. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు అట్టడుగు స్థాయి ఉన్నవారిని పైకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకోసం జీఎస్‌డీపీ ముఖ్యం. నేను అనుకున్న లక్ష్యానికి భవిష్యత్తులో రీచ్ అవుతాము. మేము తయారు చేసిన విజన్ డాక్యుమెంట్‌పై 16 లక్షల మంది తమ అభిప్రాయాలను ఇచ్చారు. చివరకు కేంద్రం వికసిత భారత్‌కు కూడా అన్ని అభిప్రాయాలు రాలేదు” అని ముఖ్యమంత్రి అన్నారు.

**మా లక్ష్యమదే...**

ప్యామిలీ మెంబర్స్ అందరికి కనెక్ట్ చేసి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. విపత్తు వస్తే ప్రతి ఇంటికి సాయం అందించగలుగుతామన్నారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ప్యామిలీ సాధనే లక్ష్యమన్నారు. పీ4 భవిష్యత్తులో ఒక గేమ్ చేంజర్ అవుతుందని.. గతంలో పీ 3 సంపద సృష్టించిందన్నారు. ఇండియా 1 నుంచి 2 శాతం గ్రోత్ చేయడం వల్ల దాన్ని హిందూ గ్రోత్ రేట్ అని ఎగతాళి చేశారన్నారు. ప్రజల్ని భాగస్వాములను చేయాలనేది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఏడు నెలలు ఏం చేశామో దక్షిణాది రాష్ట్రాలతో కంపేర్ చేసి చెపుతామన్నారు.

**గతేడాది కంటే...**

“టీడీపీ పాలనలో 13.5 శాతం గ్రోత్ ఉంది.. ఇకపై ఈ గ్రోత్ రేట్ 15 శాతం పెంచాలని చూస్తున్నాం. 2047 నాటికి ఈ వృద్ధి సాధిస్తే 58 లక్షల14 వేలు 916 కోట్ల తలసరి ఆధాయం సాధిస్తాం. ఏపీ నుంచి అమెరికా వెళ్లిన వారు అక్కడి వారి కన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆ ఎన్విరాన్మెంట్ ఇక్కడ కూడా కల్పిస్తే మన ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. వృద్ధిరేటును డబుల్ చేస్తే నాలుగున్నర రెట్లు ఆదాయం పెరిగిపోతుంది. గత ఏడాది కంటే ఈ ఏడు 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. 1 శాతం ఆదాయం పెరిగితే ఏటికేడు ఆధాయంలో పెరుగుదల వస్తుంది. ఈ ఏడాది గ్రోత్ రేటు 12. 94శాతం పెరిగింది. రాష్ట్ర సొంత ఆదాయం, అటు ఎఫ్‌ఆర్‌బీఎం కూడా ఇలా వెళితే భారిగా పెరుగుతుంది. ఈ వృద్ధి రేటు సాధించకపోతే అప్పు చేయాలి అప్పుడు డెట్ ట్రాప్‌లోకి వెళ్లిపోతాం. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. గత ఏడాది వృద్ధి రేటు 8.20 ఉంటే ఇప్పుడు 12.94 శాతంకు చేరింది. ఆల్ ఇండియా గ్రోత్ కంటే 3.24 శాతం అధనంగా గ్రో అయ్యాయి. 2019-24 కాలంలో పర్ క్యాపిటా ఇన్ కం కూడా పడిపోయింది. టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారి వ్యవసాయం రైతుకు అండగా ఉన్నాం” అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కార్యకర్తే అధినేత

-మొదటిపేజీ తరువాయి

ఉద్దేశించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లేఖ రాశారు. కార్యకర్తే అధినేత అంటూ ప్రశంసించారు. విశ్వ విఖ్యాత నటులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు పార్టీ పెట్టిన ముహూర్త బలం చాలా గట్టిదని పేర్కొన్నారు. నాడు ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా మారిందని వ్యాఖ్యానించారు. సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ఒక పండగలా నిర్వహించారని ప్రశంసించారు. ఊరూవాడా జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు, వివిధ దేశాల్లో ఉన్న ఎన్‌ఆర్‌ఐలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు అయ్యారని తెలిపారు. గత రికార్డులు తిరగరాస్తూ కోటి సభ్యత్వాలతో సరికొత్త చరిత్ర సృష్టించామని హర్షం వ్యక్తం చేశారు.

**వైసీపీకి చుక్కెదురు**

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగం.. పసుపు జెండా అంటే మనకు ఒక ఎమోషన్ అని వ్యాఖ్యానించారు. పీక మీద కత్తి పెట్టి వేరే పార్టీ అధినేతకు జై కొడితే విడిచిపెడతామని చెప్పినా జై చంద్రబాబు (%జఝ్ఘుఅఎతీఝుఝుఎబ%), జై టీడీపీ అంటూ ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య తనకు ప్రతి క్షణం గుర్తొస్తారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులు ఉన్మాదుల్లా మీద పడుతుంటే మీసం మెలేసి, తొడకొట్టి జై చంద్రబాబు అన్న అంజిరెడ్డి తాత తెగువ తనకు నిత్యస్ఫూర్తి అని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో బూత్ ఏజెంట్‌గా ఉండటానికి వీలు లేదని ప్రత్యర్థి మూకలు గొడ్డలి వేటు వేసినా రక్తపు




గాయాలతోనే పోలింగ్ బూత్‌లో కూర్చొని రిగ్గింగ్ అడ్డుకున్న ఉక్కు మహిళ మంజుల గారి ధైర్యం గురించి గుర్తుచేసుకున్న ప్రతిసారి తనకు గర్వంగా ఉంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రాణం ఎక్కువా? పార్టీ ఎక్కువా? అంటే పార్టీనే ఎక్కువ అని జైకొట్టే చేతులు అనేకం ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఏమి ఇచ్చినా, ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం టీడీపీకి మాత్రమే సొంతమని అన్నారు. ఏ పార్టీ ఇవ్వని గౌరవం తెలుగుదేశం పార్టీ తమ కార్యకర్తలకు ఇస్తుందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీలో ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నా కార్యకర్తలతో చర్చించిన తరువాతే ప్రకటిస్తారని గుర్తు చేశారు. కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవించే ఒకే ఒక్క పార్టీ తెలుగుదేశం మాత్రమే అని అన్నారు.

కార్యకర్తలను ఉద్దేశించి రాసిన లేఖలో పలు ఇతర అంశాలను కూడా ప్రస్తావించారు. “ మంచి నిర్ణయం తీసుకుంటే పొగిడేది మీరే, ఏదైనా నిర్ణయం నచ్చకపోతే ప్రశ్నించేది మీరే. అందుకే పార్టీలో ప్రతి కార్యకర్త అధినేతే. కార్యకర్తల సంతోషమే చంద్రబాబు గారికి ఆనందం. ఆయన నాతో మాట్లాడిన ప్రతిసారి కార్యకర్తల చర్చ ఖచ్చితంగా ఉంటుంది. కార్యకర్తలకు ఉపాధి, వైద్యంతో పాటు వారి పిల్లల చదువుకు సాయం చెయ్యాలని చెబుతుంటారు. కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా పవిత్రమైన బాధ్యత నాకు అప్పగించారు. ఇప్పటివరకు 2,500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం అందించాం. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5,164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందజేసాం. అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్యకర్తలకు వైద్య సహాయం అందించాం. సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. సుమారు 5,000 మంది కార్యకర్తల కుటుంబాలకు కష్ట కాలంలో అండగా నిలిచి రూ. 19 కోట్లు ఆర్థిక సహాయం చేసాం. సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు టీడీపీ కార్యకర్తల సంక్షేమ విభాగం అవిశ్రాంతంగా పని చేస్తోంది. ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలు రూ. 2 కోట్ల 35 లక్షల రూపాయలు చెల్లించాం. చదువు పూర్తయిన వారికి ఉపాధి..ఉద్యోగావకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా ప్రయోజనాన్ని రూ. 5 లక్షలకు పెంచాం. జెండా మోసే ప్రతి కార్యకర్తకు అండగా నిలవడమే నా ఎజెండా. కొన్ని నియోజకవర్గాల నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని లక్షకు పైగా సభ్యత్వాలు చెయ్యడంతో పాటు లైఫ్ టైమ్ సభ్యత్వాలు కూడా ఎక్కువగా చేశారు, వారికి నా ప్రత్యేక అభినందనలు” అని నారా లోకేశ్ లేఖలో పేర్కొన్నారు. లైఫ్ టైమ్ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తకు భరోసా ఇచ్చే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కోటి సభ్యత్వాలతో రికార్డులు బద్దలు కొట్టడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు.

# నితీష్ మరెన్నో సెంచరీలు సాధించి విజయాన్ని కొనసాగించాలి

క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆస్ట్రేలియా టూర్?లో సెంచరీ చేసిన నితీష్ కుమార్ రెడ్డిని సీఎం అభినందించారు. సీఎంను ఆంధ్ర క్రికెట్ అసోసియషన్ అపెక్స్? బాడీతో కలిసి కలిసామని నితీష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆస్ట్రేలియాలో 100 చేసినా మ్యాచ్ కోల్పోవడం బాధ అనిపించిందని వెల్లడించారు. క్రికెట్ అనేది ఒక టీం గేమ్ అందరూ రాణిస్తేనే విజయం సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. లాస్ట్ రెండు ఇన్నింగ్స్?లో కాస్త తడబడ్డా అంతకు ముందు ఇన్నింగ్స్?లో లైన్ చివరలో వచ్చినా దేశం కోసం రన్స్ సాధించానన్నారు. నితీష్?కుమార్?ను కలిసిన విషయాన్ని చంద్రబాబు ఎక్స్?లో పోస్ట్? చేశారు. ప్రపంచ వేదికపై భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన నితీష్ తెలుగు జాతికి మెరుస్తున్న స్టార్ అని అన్నారు. తన ప్రయాణంలో అతనికి మద్దతు ఇచ్చిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. నితీష్ మరెన్నో సెంచరీలు సాధించి రానున్న రోజుల్లో విజయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున సభ్యులు అందరం నితీష్‌తో సీఎంను కలిసామని ఎంపీ చిన్ని వెల్లడించారు. నితీష్ ప్రతిభకు తాము



ప్రకటించిన 25 లక్షల చెక్ సీఎం ద్వారా అందించామన్నారు. ఐపీఎల్?కు రాష్ట్రం నుండి గతేడాది ఐదుగురు ఎంపిక అయ్యారు. వచ్చే ఏడు 15 మంది ఎంపిక అయ్యేలా కృషి చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా తామంతా క్రీడలను ప్రోత్సహిస్తున్నామని అపెక్స్ సభ్యులు తెలిపారు. అంతకుముందు నితీష్ కుమార్ రెడ్డి ఆంధ్ర క్రికెట్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపీ, సానా సతీష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. నితీష్ కుమార్ రెడ్డిని ఎంపీలు ఇద్దరూ శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విశేషాలను పంచుకున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ప్రతిభను చిన్నతనంలోనే గుర్తించి క్రికెట్?లో ప్రోత్సహించినందుకు నితీష్ కుమార్ రెడ్డి తండ్రి కె. ముత్యాల రెడ్డిని ఎంపీలు ప్రశంసించారు. తన తొలి టెస్ట్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించి రికార్డ్ క్రియేట్ చేసిన నితీష్ కుమార్ రెడ్డికి ఎంపి కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఏపీలోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రికెట్?లో రాణించాలనుకునే ఎంతో మంది క్రీడాకారులకు నితీష్ కుమార్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు.

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కీలక సూచన

సంక్రాంతి సందడి ముగిసింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో స్వస్థలాలకు వెళ్లిన వారు.. మళ్లీ తిరుగు ముఖం పట్టారు. అలాంటి వేళ.. తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణం ఎలా ఉండనుంది. ప్రయాణాలకు అనుకూలమా? కాదా అంటే.. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తొలగిపోయింది. అయితే అల్పపీడన ద్రోణి ప్రభావంతో కూడిన వాతావరణం నెలకొంది. దీని వల్ల తమిళనాడు, పుదుచ్చేరిలో మరికొద్ది రోజుల్లో.. అంటే.. జనవరి 18, 19 తేదీల్లో అక్కడక్కడా.. భారీ వర్షాలు, చాలా ప్రదేశాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతారణ విభాగం గురువారం వెల్లడించింది. అరేబియా సముద్రంలో అల్పపీడనం తొలగిపోయింది. కానీ ద్రోణి తరహా వాతావరణం ఉంది. దాని వల్ల తమిళనాడు, పుదుచ్చేరిలో జనవరి 18, 19 తేదీల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక తెలుగు రాష్ట్రాలకు మాత్రం ప్రస్తుతం ఎలాంటి వాతావారణ హెచ్చరికలు జారీ చెయ్యలేదు. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అలాగే గాలి కదలిక అధికంగా ఉంటుంది. వర్షాలు మాత్రం ఎక్కడా పడే అవకాశాలు లేవు. కానీ రాత్రి వేళ మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో చలి పెరుగుతోందని వివరించింది. అలాగే గాలి వేగం చూస్తే.. బంగాళాఖాతంలో గంటకు 30 కిలోమీటర్లు.. ఏపీలో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. అలాగే తెలంగాణలో మాత్రం గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వివరించింది. పగటి వేళ ఉష్ణోగ్రతలు.. తెలంగాణలో 27 డిగ్రీల సెల్సియస్ ఉండనుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 29 డిగ్రీల సెల్సియస్‌గా ఉండనుంది. రాత్రి వేళ తెలంగాణలో 18 డిగ్రీలు, ఏపీలో 21 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటుందని పేర్కొంది. అదే విధంగా తేమ మాత్రం పగటి వేళ.. తెలంగాణలో 50 శాతం ఉంటే.. ఏపీలో 60 శాతంగా ఉంటుందంది. రాత్రివేళ తెలంగాణలో 94 శాతం ఉంటే.. ఏపీలో 95 శాతం ఉంటుందని వివరించింది. అయితే రెండు రాష్ట్రాల్లో రాత్రి వేళ మంచు ఎక్కువగా కురుస్తుందంది. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం బాగానే ఉంటుంది. పండగ వేళ.. ఊర్లకు వెళ్లి తిరిగి హైదరాబాద్ వచ్చే వారికి ప్రయాణం మాత్రం ఆహ్లాదకరంగా ఉండనుంది.

## ఏపీకి కొత్త పరిశ్రమలు..



ఉమ్మడి నెల్లూరు జిల్లా: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ ముందుకు దూసుకెళ్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. నాయుడుపేటలో ఇవాళ(గురువారం) మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతుందని చెప్పారు. మహిళలకు మూడు సిలిండర్లు, 64 లక్షల మందికి 30వ తేదీన పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. వెనక్కి వెళ్లిన పరిశ్రమలన్నీ తిరిగి మళ్లీ రాష్ట్రానికి వస్తున్నాయి.. కొత్త పరిశ్రమలు క్యూ కడుతున్నాయని అన్నారు. శ్రీ సిటీని అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు మెండుగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ సంబంధించి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

**త్వరగా షాదీఖానా నిర్మాణం పూర్తి చేస్తాం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

నంద్యాల : బనగానపల్లెలో షాదీఖానాను పునః నిర్మాణ పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం కోటి రూపాయలు, తాను సొంతంగా రూ.30 లక్షలు నిధులతో షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కొంతవరకు పనులు జరిగాయని గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం షాదీఖానా నిర్మాణాన్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్లక్ష్యం వల్ల షాదీఖానా పూర్తికాలేదని చెప్పారు. ప్రజాధనం భారీగా వృథా అయ్యిందన్నారు. వీలైనంత త్వరగా షాదీఖానా నిర్మాణం పూర్తి చేసి ముస్లిం మైనార్టీలకు అంకితం చేస్తామని తెలిపారు. ఒక ఎకరా 17 సెంట్ల వక్ఫ్ బోర్డు భూమి అన్యాక్రాంతం అయిందన్నారు. పాత బంగ్లా వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.

## ఆ అధికారులపై మంత్రి నాదెండ్ల మనోహర్ ఫైర్..

**ఏలూరు జిల్లా:** ఏలూరు ఆస్పత్రి వైద్య సిబ్బందిపై మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఇవాళ(గురువారం) మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ సేవలు సరిగా అందకపోవడంపై ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయకపోవడంపై సిబ్బందిపై మంత్రి మనోహర్ మండిపడ్డారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మగవారికి, మహిళలకు విడివిడిగా ఓపీ సేవలు అందేలా చూడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి మనోహర్ హెచ్చరించారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై అధికారులను మంత్రి నిలదీశారు. నెల రోజుల్లో ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను మంత్రి మనోహర్ పరిశీలించారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. సిబ్బంది కొరత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## ఏపీకి ఆసియాలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టు

-మొదటిపేజీ తరువాయి

కొనుగోలు చేసేలా సెకి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్తును దేశంలోని వివిధ పంపిణీ సంస్థలకు సరఫరా చేస్తుంది. బిల్డ్-ఓన్-ఆపరేట్ (బీఓటీ) విధానంలో ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు.



**సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాలుగా**

ఏపీలో ప్రతి ఇల్లు, కార్యాలయం సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాలుగా మారాలని సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో త్వరలో సౌరకాంతులు వెదజల్లనున్నాయి. పీఎం సూర్యఘర్ పథకం ఇక్కడ ప్రత్యేకత సంతరించుకోనుంది. ఇక్కడి గృహవిద్యుత్తు కనెక్షన్లను సౌర వ్యవస్థతో అనుసంధానించడానికి చేపట్టనున్న పైలట్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. నియోజకవర్గం పరిధిలో 50 వేల గృహ కనెక్షన్లకు సౌరవిద్యుత్తు ఏర్పాటు లక్ష్యంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో ఎలక్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీ (రెస్కో) కి 1.30 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహవినియోగ కనెక్షన్లు 77 వేలు ఉండగా వాటిలో సరాసరి 50 వేల కనెక్షన్లు సౌర విద్యుత్తు అందించేందుకు ఎస్పీడీసీఎల్, రెస్కో అధికారులు గుర్తించారు.

## సంపాదకీయం

# నిస్సహాయులుగా మార్చే పెట్టుబడిదారీ వ్యవస్థ

ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తిలో ఇమిడి ఉండే వేతన, వేతన రహిత శ్రమ పెట్టుబడి సంచయానికి దోహదం చేస్తుంది. సరుకులు, సేవల ఉత్పత్తికి అవసరమైన శ్రామికశక్తి ఒనగూడడానికి సామాజిక పునరుత్పత్తి సంవిధానం తోడ్పాటు ఇస్తుంది. భారీ ఎత్తున జరిగే సరుకుల ఉత్పత్తిని పెట్టుబడిదారీ వ్యవస్థగా నిర్వచిస్తుంటారు. శ్రామికశక్తిని సరుకుగా మార్చడం పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. ఈ క్రమంలో సమాజంలోని శ్రామికులు నిస్సహాయంగా తయారయ్యే పరిస్థితులను నిరంతరాయంగా సృష్టిస్తూ ఉంటుంది పెట్టుబడిదారీ వ్యవస్థ. కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకున్నందుకు బదులుగా జీతం స్వీకరిస్తారు. కాబట్టి ఇది చెల్లుకు చెల్లు అన్న రీతిలో ఎంత మాత్రం నిర్బంధపూరితం కాని సర్వసాధారణ అంశంగా పైకి కనబడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు ఎవరి ఆధీనంలో ఉంటాయో ఆ యాజమానులకు అదనపు విలువ గడించి పెట్టేలా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తారు. యజమానులు లాభాలు, సంపదా పోగేసుకుంటూ ఉంటే కార్మికులు మాత్రం నానాటికీ పేదరికంలోకి జారిపోతూ ఉంటారు. ఉత్పత్తి సాధనాల మీద కార్మికులను హక్కులు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. ఆదిమ పెట్టుబడి సంచయం ద్వారా అంటే నిర్బంధపూరిత విధానాల ద్వారా శ్రామికులను నిస్సహాయంగా మార్చడం అనేది ఇంకో పద్ధతి. ఇందులో ప్రత్యక్ష ఉత్పత్తిదారుడిని బలవంతంగా ఉత్పత్తి సాధనాల నుండి వేరు చేసి, ఈ ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిగా మలిచి కార్మికులకు తమ శ్రమశక్తిని అమ్ముకోవడం మినహా మరో గత్యంతరం లేని పరిస్థితి సృష్టిస్తారు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికీకరణ ప్రధాన ధోరణిగా కొనసాగుతుంది. అంటే కార్మికులు తమ శ్రమ శక్తిని అమ్ముకుని బదులుగా జీతాలు అందుకుంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముదిరాక శ్రామికీరణ మూలంగానే కార్మికులు నిస్సహాయులుగా మారతారని అనుకోనక్కరలేదు. ఎందుకంటే పెట్టుబడి ప్రత్యక్షంగా కార్మికులను పనిలో పెట్టుకోదు. అయితే పెట్టుబడి సంచయం జరిగే క్రమంలో శ్రమశక్తిని కల్పించడానికి కూడా శ్రమ చెయ్యాల్సి ఉంటుంది. ఈ శ్రమ వేతన రహిత శ్రమ కాబట్టి దీనికి పెద్దగా గుర్తింపు ఉండదు. వంట చెయ్యడం, పిల్లలను సాకడం, ఇంట్లో ముసలివాళ్ళకు సేవ చెయ్యడం, కుటుంబంలో సభ్యులందరి మంచి చెడ్డలు చూసుకోవడం ఇవన్నీ ప్రతి ఇంట్లో ఆడవాళ్ళు చేసే పైసా ప్రతిఫలం లేని చాకిరేయే. ఇది ఇంటి పని అని సరిపెడుతున్నారు. కానీ ఇది వేతన రహిత శ్రమ అని వర్ధమాన దేశీల్లోనే కాదు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ గుర్తిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. 'కుటుంబ ఆదాయం' అనేది విచ్ఛిన్నం కావడం, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, మానవ శ్రమకు బదులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో అటు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ, ఇటు వర్ధమాన దేశాల్లోనూ వివిధ తరగతుల్లో వేర్వేరు కారణాల రీత్యా వేతన రహిత శ్రమ పెరుగుతూ వస్తున్నది. పెట్టుబడి సంచయానికి ఉత్పత్తి, వినియోగం ఈ రెండూ కీలక అవసరాలే. పెట్టుబడిదారులు ముడిసరుకులు, యంత్రాలు, కార్మికుల శ్రమను కొనుగోలు చేయడానికి పెట్టుబడి పెడతారు. ఉత్పత్తి అయ్యే క్రమంలో అదనపు విలువ ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు ఒనగూరుతాయి. అయితే ఈ లాభం పెట్టుబడిదారుడి సొంతం కావాలంటే ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్‌లో అమ్ముడుపోవాలి. ఇది జరగాలంటే వాణిజ్య పెట్టుబడి అంటే వాణిజ్యపు ప్రకటనలు, సరుకులు, అమ్మే వ్యాపారులు అవసరం. ఉత్పత్తి అయిన సరుకులు మార్కెట్‌లో అమ్ముడయ్యేందుకు వీలుగా పెట్టుబడిదారుడు వాణిజ్య అవసరాల కోసం అదనపు విలువలో కొంత భాగాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియలో శ్రమశక్తి ఇమిడిపోయింది. పెట్టుబడిదారుడు అదనపు విలువను లాభంగా మార్చుకోవడంలో నష్టాన్ని నివారించుకోవడానికి గాను వేతన శ్రమకు బదులు వేతన రహిత శ్రమను వినియోగించుంటారు. కుటుంబ వేతనం విచ్ఛిన్నం కావడంతో ఒక్క జీతంతో కుటుంబ పోషణ గడిచే పరిస్థితి ఉండదు. పూట గడవడం కోసం ఇంట్లో ఆడవాళ్లు కూడా పని వెతుక్కోవాల్సి వస్తుంది. లేదా ఇంట్లో మగ మనిషి పని కోసం పరాయి ఊళ్లోకి వలస వెళితే, మహిళలు ఇంటిపట్టునే ఉండి కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ వేతనరహిత శ్రమ చేయాల్సి వస్తుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా వినియోగక్రమంలో కొనుగోలుదారులు వేతనరహిత శ్రమను అందించడం గణనీయంగా పెరిగింది. తద్వారా పెట్టుబడిదారు వాణిజ్య పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటాడు. బట్టల షాపుల్లో, డిపార్ట్‌మెంట్ స్టోర్లలో ఇతరేతర షోరూముల్లో సేల్స్ సిబ్బందిని గణనీయంగా తగ్గించివేశారు. వెండింగ్ మిషన్లు, టెల్లర్ కౌంటర్లు ఏర్పాటు చేయడం, ఖాతాదారులకు సెల్ఫ్ సర్వీస్ అలవర్చడం ద్వారా రిటైల్ ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అంటే వేతన రహిత శ్రమను ప్రజాక్షేత్రంలో కూడా విస్తృతపరిచి అమ్మకాల వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు. వాస్తవం ఏమిటంటే వివిధ రూపాల్లో వేతనరహిత శ్రమను పెంపొందిస్తున్నా తద్వారా ప్రత్యక్షంగా లాభాలను ఉత్పత్తి చేయలేరు. వేతన కార్మికుల నుండి ఎంత ఎక్కువగా శ్రమ దోపిడి చేస్తే అంత ఎక్కువ అదనపు విలువను పిండుకుంటుంది పెట్టుబడి. అయితే వివిధ రూపాల్లోని వేతన రహిత శ్రమ.. శ్రమ శక్తిని మరింత చౌకగా మారుస్తుంది. అలాగే పంపిణీ వ్యయాన్ని తగ్గించి మరింత అదనపు విలువ పిండుకోవడానికి వీలవుతుంది. వేతన కార్మికుల సంఖ్యను తగ్గించే, వేతనరహిత శ్రమను అందించే మిషన్లు ప్రవేశపెట్టడం ద్వారా తగ్గించుకుంటూ పోవడంద్వారా నిరుద్యోగం ప్రబలడానికి, కార్మికుల ఉమ్మడి బేరసారాల శక్తి తగ్గిపోవడానికి దారితీస్తుంది. కాబట్టి వేర్వేరు పరిస్థితులలో వేతనశ్రమ, వేతన రహిత శ్రమ మధ్య ఉన్న చలన సూత్రాలను పెట్టుబడి సంచయ స్వభావం నిర్ణయిస్తుంది. లాభాల హెచ్చింపుకు దోహదం చేస్తుంది. వర్ధమాన దేశాల్లోని స్వయం ఉపాధి కార్మికులు చౌక మార్కెట్లలో అమ్ముడుపోయే సరుకులు, సేవలు ఉత్పత్తి చెయ్యడం ద్వారా శ్రామికశక్తి పునరుత్పాదకతకు అవసరమయ్యే వ్యయాన్ని కట్టడి చేసేందుకు చూస్తారు. అలాగే సంఘటిత రంగంలో కాంట్రాక్టీకరణ ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తి రంగాల రెండింటికీ వేతనేతర శ్రమ తోడ్పాటు ఇస్తుంది. వేతన శ్రమ, వేతనేతర శ్రమలు ప్రధాన వేతన ఆదాయానికి ఎలా తోడ్పడతాయనేది ఆయా వర్గాలవారీగా, వేర్వేరుగా ఉంటుంది. శ్రామిక కుటుంబాలలో కుటుంబ వేతనం మీద అంటే ఒక వేతనం మీద ఆధారపడి కుటుంబ పోషణ గడిచే పరిస్థితి లేదు. నిజవేతనాలు స్తంభించిపోవడమో, దిగజారి పోవడం మూలంగానో కుటుంబ పోషణ కోసం మహిళలు కూడా శ్రామిక శక్తిలో భాగస్వామ్యం కావడం నానాటికీ పెరుగుతూ వస్తుంది. ఈ విధంగా కుటుంబంలో ఇద్దరూ పని చేయాల్సి రావడంతో వేతన రహిత శ్రమ అంటే ఇంటి పనులు, బిడ్డల సంరక్షణ వంటి బాధ్యతలు పలుచబడతాయి. ఉన్నత మధ్య తరగతి వర్గాల్లో ఈ పనులు చేసేందుకు పని మనుషులను పెట్టుకుంటారు. అంటే వేతన రహిత శ్రమ స్థానాన్ని వేతన శ్రమ భర్తీ చేస్తుంది. అదే ధనిక దేశాల్లో అయితే ఇంటి సనులు చక్కబెట్టడానికి రకరాల గృహోపకరణ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇవి కొనే స్థోమత, వీటిని వినియోగించగలిగే సమయం ఉన్న వారికే ఉపయోగకరం. అంటే ధనిక కుటుంబాల వేతన రహిత శ్రమ సామాజిక పునరుత్పత్తి కార్యకలాపాల వ్యయాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది. అదే శ్రామిక కుటుంబాల్లో అయితే వాళ్ళ ఆదాయాలు కుటుంబ పోషణకీ బొటాబొటిగా సరిపోతాయి కాబట్టి ఇంటి పనుల కోసం వేరే మనుషులను పెట్టుకునే పరిస్థితి ఉండదు. పర్యవసానంగా వేతన రహిత శ్రమ కుంచించుకుపోయి సామాజిక పునరుత్పత్తి క్రమం అంతే పిల్లల ఆరోగ్యం, చదువులు మున్నగునవి దెబ్బతినిపోతాయి. అంటే వేతన శ్రమ, వేతనేతర శ్రమలు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం మీద వేర్వేరు ప్రభావాలు చూపుతాయని స్పష్టం అవుతున్నది. అంతిమంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రత్యేకించి రోబోట్లు, కృతిమ మేధ వంటి వాటి వినియోగం భవిష్యత్‌లో వేతన శ్రమ, వేతన రహిత శ్రమ మీద ప్రభావం చూపించనున్నది. వేతన శ్రమను వేతన రహిత శ్రమలో భర్తీ చేయడం మూలంగా కార్మికుల నిజ వేతనాలు పడిపోయే అవకాశం ఉంటుంది. సామాజిక పునరుత్పత్తి క్రమం మీద ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం కారణంగా శ్రమశక్తి ఉత్పత్తి వ్యయం తగ్గుముఖం పడుతుంది.

# అలనాటి మేటి నటి శాంతకుమారి



తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి. తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్టీ రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు. ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించి వందకు పైగా సినిమాల్లో నటించారు. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాసులో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె.పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిండియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక – నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట – గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్టపాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసుకొన్న తరువాతకూడ ఆమె నట జీవితం సాఫీగా కొన సాగింది. శాంతకుమారి పి.పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు. శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేలీ లక్ష్మి, ఆరణి సత్యనారాయణ మొదలైన వారు నటించారు. హను మంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్థాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు. పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయోగించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), మరియు ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధంగి 'జయభేరి, ప్రేమ్‌నగర్' ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించడం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు. మాయాబజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937), భక్త జయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్ట బుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957), జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968), అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు. 1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు. తెలుగు వెండి తెర బామ్మ 86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006 న స్వగృహంలో మృతి చెందారు.

# సినీపరిశ్రమ ప్రజ్ఞాశాలి ఎల్‌వి ప్రసాద్




భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీపరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీనిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడు. మొట్టమొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్', తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహేబ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం',' ద్రోహి','సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకా ల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావు కారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్' దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు. ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

# కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు

భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సి స్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో
# ఎన్టీఆర్ వర్ధంతికి భారీ ఏర్పాట్లు




ఆర్ట్స్ కళాశాల దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాట్లు
పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాకాలు

**అనంతపురం జనవరి 16 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతికి అనంతపురం నగరంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనెల 18న ఎన్టీఆర్ వర్ధంతి జరగనుంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పరిశీలించి, అక్కడ రంగులు వేయించారు. అలంకరణ చేసేందుకు అన్నీ సిద్ధం చేశారు. మరోవైపు ఎన్టీఆర్ వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించేం దుకు కూడా సన్నాహాకాలు చేస్తున్నారు. వర్ధంతి కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల నరసింహులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చాకలి పరమేష్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి యాదవ్, మణికంఠ బాబు, తేఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్ కుమార్, టిడిపి నాయకులు ఆదినారాయణ, తాటి మధు, మాజీ కో ఆప్షన్ మెంబర్ మున్వర్, పూల భాష, సిరిసాల రాంబాబు, చెక్క నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వంలో పల్లెసీమలు రూపురేఖలు మారుతున్నాయి.

అభివృద్ధి,సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ళు.
మూడు చిన్న గ్రామాల్లో ఒకే రోజు రూ 3.30 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం.
రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు జనవరి 16 ప్రజాజ్యోతి న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళు అని, పల్లెసీమలు రూపురేఖలను మార్చి ప్రజల్లో ఆనందాన్ని చూడాలన్నదే ప్రభుత్వ ఆశయం అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం పాల కొల్లు మండలం వెలివెల, చింతపర్రు, వడ్లవానిపాలెం గ్రామా ల్లో రూ 3.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శ్రీకారం చుట్టారు. మంత్రి రామానాయుడు స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ ప్రజలకు అభివాదాలు చేస్తూ, యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాలలో ప్రజలు అడుగడుగునా మంత్రికి ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులను ఇచ్చి నుదుటన కుంకుమ తిలకందిద్ది మంత్రి రామానాయుడుకి మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ గత ప్రభుత్వ ఐదేళ్ల అరాచక పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య పవన్ కళ్యాణ్ చొరవతో తిరిగి పరిశ్రమలను, పారిశ్రామిక వేత్తలను తీసుకువచ్చి పరిశ్రమలు నెలకొల్పి యువతీ యువకులకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రం 14 లక్షల కోట్లు అప్పు ఉన్నను సంక్షేమం అభివృద్ధికి నిధులు కొరత లేకుండా చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు త్రాగునీరు సరిగా వచ్చుటలేదని వచ్చిన నీళ్లు కల్లాపుకు మొక్కలకు పోసుకుంటున్నామని మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఆరోజు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో 60 శాతం నిధులు మంచినీళ్లు కొరకు వేచ్చిస్తున్నామని, ప్రతి ఇంటికి కుళాయి, పైప్ లైన్లు, మైక్రో ఫిల్టర్ బెడ్లు నిర్మించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరును రెండు పూటలూ పుష్కలంగా అందిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, తహశీల్దారు వై. దుర్గాకిషోర్, యంపిడివో యన్.యన్. ఉమా మహేశ్వర రావు, డిఇలు కలవకోలను దుర్గా రామస్వామి, బి.వి. రమణ, పి.శ్రీనివాసరావు, రామాయ ణం త్రిమూర్తులు, ఈవోపీఆర్డి టి.మూర్తిబాబు, సహాయక ఇంజనీరు వి.శ్యాంబాబు, యంపిపి చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవింద రాజులు నాయుడు, గ్రామ సర్పంచులు కందుల వెంకటేశ్వర రావు, గుమ్మాపు పెద్దిరాజు, పెనుమత్స పద్మ, నాయకులు కోడి విజయ భాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు, పెనుమత్స రామబద్రి రాజు, పాముల రజనీ కుమార్, మహమ్మద్ జానీ, చినమిల్లి గణపతిరావు, అందేకోట వీరభద్రం, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేంతవరకు అటవీ శాఖ ఆఫీసర్
# పదోన్నతుల ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేయాలి



**అనంతపురం జనవరి 16 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అటవీశాఖ – డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ల పదోన్నతుల ప్రక్రియ – ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేంత వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని అనంతపు రం లోని అటవీ శాఖ కార్యాలయంలో చీఫ్ కన్సర్వేటర్ ఆర్.యశోద భాయ్ కి మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎం ఈ ఎఫ్) నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమీషన్ త్వరలో నివేదిక సమర్పించనుంది. అనంతరం త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు జరుగుతుంది. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లుగా ఇంతవరకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు లేరు. అన్ని పదోన్నతుల్లోనూ మాల సామాజిక వర్గానికి చెందిన వారే అవకాశాలు దక్కించుకున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు జరిగితే మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు కూడా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. అందువల్ల అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ల పదోన్నతల ప్రక్రియ ఎస్సి వర్గీకరణ జరిగేంతవరకు పదోన్నతుల ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేయా లని, తద్వారా తమరి హయాంలో మాదిగ ఉద్యోగులకు న్యాయం చేయాలని అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ ఆర్.యశోద భాయ్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. అశోక్ కుమార్, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్, ఎంఎస్పి శ్రీ సత్య సాయి జిల్లా అధికార ప్రతినిధి నాగభూషణం, మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు బాణాసి శీన, సోమల దొడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో అంతిమ సంస్కారం




**గుంతకల్లు జనవరి 16 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** పట్టణంలోని నిర్మల హృదయ భవన్లో ఆశ్రయం పొందుతున్న మునిలక్ష్మి 65 సం" వయసుగల వృద్ధ మహిళ మరణించడం జరిగింది. నిర్మల హృదయ భవన్ నిర్వాహకులు సిస్టర్స్ ఆ నలుగురు సేవా సమితి వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించవలసిందిగా విజ్ఞప్తి చేయగా ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో పాత గుంతకల్లు హిందూ స్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల వెంకటేష్ కరాటే రవితేజ, వంశీ,రవీంద్ర,ఆటో వేణు, జనసేన,పురుషోత్తం పాల్గొన్నారు.

## ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్‌కు ఎంపికైన అభ్యర్థులు

**అనంతపురం జనవరి 16 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల,కర్నూలు అనంతపురం జిల్లా నందు 2024 2025 సంవత్సరము నకు ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్ కు ఎంపికైన అభ్యర్థుల వివరములు సీరియల్ నెంబర్, ట్రేడ్ వైస్ క్రింద యివ్వబడినవి. డీజిల్ మెకానిక్స్ : 77,157,100,92, 58, 135, 90, 156, 186, 101, 120, 98,224, 142, 40, 211, 238, 170, 17, 131, 97, 208, 11, 60, 68, 33, 169, 225, %ఝీఖ్రీ: 41, 78, 204, 236, 210, 173, 184, 55, 191, 218. %మోటార్ మెకానిక్ :– 47,48,4 ఎలక్ట్రిషియన్ – 58, 217, 235, 257, 56 ఫిట్టర్ :
35 డ్రాఫ్ట్ మాన్ (సివిల్): 15 పైన తెలుపబడిన అభ్యర్థులు తమ యొక్క ఒరిజినల్ యస్. యస్ .సి మరియు ఐటి ఐతో పాటు %ాజ/ూ/దీజ% అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రములు (పర్మనెంట్ సర్టిఫికేట్ లేనియెడల ఆరు నెలల లోపు జారీ చేయబడిన తాత్కాలిక కుల ధృవీకరణ పత్రము), వికలాంగులైనచో ధృవీకరణ పత్రము, మరియు యన్.సి.సి /స్పోర్ట్స్ (యూనివర్సిటీ /రాష్ట్ర /జాతీయ లెవెల్), పాన్ కార్డ్ ) ఇతరములు లైసెన్స్ (డ్రైవింగ్/%ప్రశీజ్% చే జారీ చేయబడిన %×ణ జూతీశీశీటం%), బ్యాంక్ అక్కౌంట్ పాస్ బుక్ , 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డ్ టఅలాగే అన్నీ 2 సెట్ జిరాక్స్ కాపీలతో) లతో జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, కర్నూల్ కు 21.01.25 ఉదయం 09.00 గంటలకు హాజరు కావలయును.
గమనిక: ఈ ఫలితాల అధికార నిర్ధారణ కొరకు %ూూ=జ% జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ/%ణూం/ణజూశీం% నోటీసు బోర్డు నందు ఉంచడమైనది. ప్రిన్సిపాల్ %ణఒ%(ఎస్ నజీర్ అహ్మద్.) జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ఎ.పి.యస్ . ఆర్ .టి.సి కర్నూలు (48),అనంతపురం జిల్లా ప్రభుత్వ బాలుర ఐటిఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

## నువ్వు ఇచ్చే రక్తం ఒకరికి దానం మరొకరికి ప్రాణం దానం

రక్తదానం చేయండి నిండు జీవితాన్ని కాపాడండి




**గుంతకల్లు జనవరి 16 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** పట్టణములోని కె.బి హాస్పిటల్ నందు పెంచలపాడు లక్ష్మి అనే పేషెంట్ కు 3.9 రక్తం తక్కువ ఉండడం వల్ల ఏ పాజిటివ్ రక్తం అవసరం కాగా గుంతకల్లు లెజెండ్ రక్తం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రంజాన్ కి సంప్రదించగా రక్తదాత రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏ పాజిటివ్ రమేష్ కి సమాచారం ఇవ్వగా అతను స్పందించి వెంటనే గోపి బ్లడ్ బ్యాంక్కు వచ్చి రక్తదానం చేశాడు సకాలంలో స్పందించిన ఏ పాజిటివ్ రక్త దానం చేశారు. లెజెండ్ రక్తం ఆర్గనైజేషన్ తరపున, మరియు పేషెంట్ బంధువులు రక్తదాత రమేష్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ రక్తదానంలో పాల్గొన్న రైల్వే ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ బాబు బిల్డింగ్ కాంట్రాక్ట్ మాబు పాల్గొన్నారు.

## నెట్టికంటి ఆంజనేయ స్వామి దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ పి హరినాథ్ గుప్తా. జి గోపాలకృష్ణ మాజీ ప్రిన్సిపల్ జడ్జి.





**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం కసాపురం స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ శ్రీ పి హరినాథ్ గుప్తా మరియు తెలంగాణ రాష్ట్ర ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రిన్సిపల్ జడ్జి శ్రీ జి.గోపాల కృష్ణ వారిని ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు స్వాగతం పలికారు అనంతరం స్వామి వారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఎపిలోని అంతర్జాతీయ క్రీడాకారులకు చంద్రబాబు ప్రోత్సాహం



**విజయవాడ వెస్ట్ ప్రజా జ్యోతి రిపోర్టర్ చంద్రశేఖర్** అన్ని విధాలుగా క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహిస్తారు ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు ఏసీఏ తరుపున నితీష్ కుమార్ రెడ్డికి రూ 25 లక్షల చెక్కు సీఎం చంద్రబాబు అందించారు ప్రభుత్వం తరుపున ఇంటి స్థలం త్వరలో అందజేయనున్నట్టు చెప్పారు అమరావతి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తు ఆడుతున్న రాష్ట్ర క్రీడాకారులు మరింతగా రాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కల్పించనున్నారని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు విశాఖకు చెందిన టీమ్ ఇండియా క్రికెట్ ప్లేయర్ కె నితీష్ కుమార్ రెడ్డి ఏసీఏ అధ్యక్షుడు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్ లతో కలిసి గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ను నాయుడును కలిశారు

బోర్డర్–గావస్కర్ సిరీస్‌లో సత్తా చాటిన తెలుగుతేజం నితీష్ కుమార్ రెడ్డి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు నితీష్ కుమార్ రెడ్డి తో మాట్లాడి తన క్రికెట్ విశేషాలు అడిగి తెలుసుకున్నారు నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు ఏసిఏ అధ్యక్షుడు గా ఎంపి కేశినేని శివనాథ్ పని తీరును సీఎం చంద్రబాబు అభినందించారు రాష్ట్ర ప్రభత్వం తరుపున క్రికెటర్ కె.నితీష్ కుమార్ రెడ్డికి త్వరలోనే ఇంటి స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు ఎసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి వెంకట రామ ప్రశాంత్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ ఏసీఏ కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్ కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు

# పెద్దనాపల్లిలో ఘనంగా ముగిసిన సంక్రాంతి సంబరాలు

**ఏలేశ్వరం ప్రజా జ్యోతి ప్రతినిధి** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో 16వ వార్షికోత్సవ మన ఊరు మన సంక్రాంతి కార్యక్రమాల్లో భాగంగా సంక్రాంతి సంబరాలు సర్పంచ్ బుద్ధ సూర్య ప్రకాష్ ఎంపీటీసీ 1 సభ్యులు బుద్ధ సత్యవతి ఈశ్వరరావు బుద్ధ సన్యాసిబాబు బుద్ధ కృష్ణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి భోగి మంటలు గంగిరెద్దు ఆటలు ముగ్గుల పోటీలు చిన్నారులచే నృత్య ప్రదర్శన వంటి పలు రకాల సాంసృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి నిర్వాహకులు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమాల్లో మహిళలు యువత పాల్గొని ఉత్సాహంగా గడిపారు ఈ సందర్భంగా సర్పంచ్ బుద్ద సూర్య ప్రకాష్,యువ నాయకులు బుద్ద కృష్ణబాబు మాట్లాడుతూ మన పండుగలను మన సంప్రదాయ సంస్కృతులను ఆచరిస్తూ పరిరక్షించికోవాలని అన్నారు ఎమ్మెల్యే సత్యప్రభ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో బుద్ధ చంటిబాబు సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు మల్ల చిన్నబ్బాయి కోడెల దుర్గారావు భీశెట్టి ఈశ్వరఅబ్బాయి మల్ల వెంకటేశ్వర్లు దాడి గంగ శరకణం గోవిందరావు బుద్ధ అప్పన్నబాబ వల్లూరి త్రిమూర్తులు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు





# నాగేంద్ర చౌదరి ఆధ్వర్యంలో అనాధ శవానికి దహన సంస్కారాలు

**గండేపల్లి ప్రజా జ్యోతి రిపోర్టర్ అరుణ** అనాధ శవానికి దహన సంస్కారాలు నిర్వహించిన కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి స్థానిక సంత మార్కెట్ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి తన సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వారు మరణించక తప్పదని మరణించిన ప్రతి వ్యక్తి ఆ పరమాత్మని సన్నిధికి చేరుకుంటామని అన్నారు. జగ్గంపేట సంత మార్కెట్లో గుర్తు తెలియని వ్యక్తి మరణించారని తెలియడంతో పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించి వారి ఆత్మ శాంతి చేకూరాలని హిందూ శాస్త్ర ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించామని తెలియజేశారు ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది అనే నినాదంతో సనాతన ధర్మం కోసం భారతీయ ధర్మ పరిషత్ పనిచేస్తుందని మెట్ట ప్రాంతంలో ఎక్కడైనా అనాధలు చనిపోతే వారి దాహన సంస్కారాలు మా సొంత ఖర్చులతో నిర్వహిస్తామని అన్నారు. గత ఏడు



సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ సేవా రత్న బిరుదు అందుకున్న ఆయన ఆ బిరుదుకు సార్ధకత చేకూరుస్తూ అనేక రకాల సేవలందిస్తున్న నాగేంద్ర చౌదరిని పలువురు ప్రసంశించి అభినందిస్తున్నారు

# పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కమిషనర్

**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని సూర్యలంక రోడ్డులో గల అన్న క్యాంటీన్ గురువారం మునిసిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి పురపాలక సంఘ అధికారులతో కలిసి పరిశీలించారు అన్న క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి క్యాంటీన్ పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ ఆహారం యొక్క నాణ్యతను త్రాగునీరు కల్పించిన సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం వెన్నెలకంటి నగర్ శారదాపురి కాలనీ నందు పర్యటించి అర్బన్ హెల్త్ సెంటర్ వైపు వెళ్ళు రోడ్డు నిర్మాణ పనుల గురించి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో చర్చించారు త్వరితగతన అంచనాలు తయారు చేసి రోడ్డు పనులను పూర్తి చేయాలని వారికి కమిషనర్ సూచించారు మల్లికార్జున బృందావనం వైపు వెళ్ళు రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించి త్వరితగతన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి అసిస్టెంట్ ఇంజనీర్ జి ప్రసాద్ రెవిన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు



## తెలుగుదేశం పార్టీ నాయకురాలు ఉమాదేవి కూతురు జన్మదిన వేడుకలు





**ప్రజా జ్యోతి రిపోర్టర్ గుత్తి కృష్ణ** గుంతకల్ పట్టణం నందు తెలుగుదేశం పార్టీ నాయకురాలు ఉమాదేవి కుమా ర్తె జన్మదిన వేడుకల్లో గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ కుటుంబ సమేతంగా పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని మనసు పూర్తిగా ఆశీర్వదించారు ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు... ఇట్లు... రామరాజు పల్లి గుత్తి రిపోర్టర్ కృష్ణ ఆచారి

## రోడ్డు ప్రమాదాలు తగ్గించడం మనందరి బాద్యత జిల్లా కలెక్టర్



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి సూచించారు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రహదారి భద్రత కి సంబంధించిన ప్రచార బ్యానర్స్ మరియు పోస్టర్స్ ను కలెక్టర్ ఆవిష్కరించారు రహదారి భద్రతా మాసోత్సవాలు ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తారని తెలిపారు అనుకోకుండా సంభవించే రోడ్డు ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఇది చాలా బాధాకరమని కలెక్టర్ చెప్పారు ఈ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని కోరారు రహదారి భద్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు ప్రతి ఒక్కరి లో రహదారి భద్రత పై అవగాహన పెంచేందుకు రహదారి భద్రతలో అనుబంధ శాఖలు అయిన రవాణా పోలీస్ రహదారి ఇంజనీరింగ్ మరియు వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో కలసి పని చేయాలని కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి కె పరందామ రెడ్డి బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా విజయమ్మ డి సి హెచ్ ఎస్ శేషు కుమార్ బాపట్ల డిపో మేనేజర్ బి శ్రీమన్నారాయణ రోడ్ సేఫ్టీ ఎన్జీఓ రాజా సాల్మన్ మరియు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదం బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీను కాకినాడ జిల్లా** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి వద్ద రోడ్డు ప్రమాదములో మృతుల కుటుంబాలకు కుటుంబాలకు క్షతగాత్రులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను ఎమ్మెల్యే సత్య ప్రభ ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గోపాల చెరువు వద్ద 20 మందితో ప్రయాణిస్తున్న టెంపో వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు మృతి చెందారు ఈ ఘటన లో మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు కాకినాడకు చెందిన 20 మంది టెంపో వాహనంలో దారపల్లిలో జలపాతం వీక్షించడానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది ప్రమాద విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే హుటాహుటిన ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు క్షతగాత్రులను బాధిత కుటుంబాలను ఆస్పత్రి వద్ద పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే కోరారు ఘటన జరగడం దురదృష్టకరమని ఇలాంటివి పునరావృతం కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని క్షతగాత్రులకు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు

## ధర్మవరం మైదానాన్ని శుభ్రపరిచిన
# బిజెపి నేతలు, కార్యకర్తలు, మున్సిపాలిటీ అధికారులు





స్వచ్ఛ ధర్మవరంకు కట్టుబడి మైదానంలో చెత్త తొలగింపు కార్యక్రమం నిర్వహించిన బిజెపి నాయకులు కార్యకర్తలు.

కళాశాల మైదానం లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించిన బిజెపి నాయకులు కార్యకర్తలు.

**ధర్మవరం జనవరి 16:** ధర్మవరం పట్టణం లోని కళాశాల మైదానం లో సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మైదానంలో పేరుకుపోయిన చెత్త ను మంత్రివర్యులు సత్యకుమార్ ఆదేశాల మేరకు బిజెపి నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ సిబ్బంది తో కలిసి చెత్తను తొలగించి మైదానం ను శుభ్రపరిచారు. మన పరిసరాలను మనమే శుభ్రపరుచుకోవాలని, స్వచ్ఛ ధర్మవరం కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మైదానం ను శుభ్రపరిచినందుకు క్రీడాకారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజల కు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మిన్సిపాలిటీ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, ఐ.సి.డి.యస్ సిబ్బందికి అగ్రికల్చర్ సిబ్బందికి మంత్రి తరుపున బిజెపి నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ గారు,బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి,శ్యామరావు, పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు,, కొండమీద రాయుడు, నాగభూషణం, జూటూరు వెంకటేష్, మంజునాథ్, మహేష్, నబిరసూల్ ,సోమ్లా నాయక్, మిర్యాల అంజి, రాధమ్మ, శారదమ్మ,ఈశ్వర్ నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

# డా. పార్థసారథికి "కవిరత్న" బిరుదు

ఈ నెల 21న విజయవాడలో ప్రదానోత్సవం

**విజయవాడ/16 :** ఐ.ఎస్.ఓ. గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధానకార్యదర్శి, ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త, విశ్రాంత డిఇఓ డాక్టర్ తేలి పార్థసారథికి ప్రతిష్టాత్మకమైన "కవిరత్న" బిరుదు లభించింది. ఈ మేరకు వరల్డ్ రైటర్స్ ఫోరమ్, ప్రపంచ కవితా అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ - బుక్ ఆఫ్ రికార్డ్స్ (టిఎన్ఏ) సంయుక్తంగా ప్రకటించాయి. విజయవాడ లోని శ్రీ కౌతా పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈ నెల 21 వ తేదీ ఉదయం అవార్డు అందజేస్తామని ఆయనకు ఆహ్వానపత్రం పంపాయి. ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జన్మదినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులుగా, జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, రాష్ట్ర స్థాయి, జిల్లా కమిటీల్లో పలు హోదాల్లో డా. టి. పార్థసారధి విశేష సేవలందించారు. తనపై విశ్వాసంతో జాతీయ ప్రధానకార్యదర్శిగా కీలక బాధ్యతను అప్పగించడమే గాక, అవార్డులు, బిరుదులు దక్కేలా ఎంతగానో ప్రోత్సహిస్తున్న ఛైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ కు పార్థసారధి ధన్యవాదాలు తెలిపారు. ఛైర్మన్ అందిస్తున్న ప్రోత్సాహంతో సంస్థ సేవకు పునరంకిత మవుతానన్నారు. అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, జాతీయ కల్చరల్ వింగ్ డైరెక్టర్ దేబా విజయ్ కుమార్, జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ తదితరుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మక సంస్థ శ్రీశ్రీ కళావేదిక సేవలో అంకితభావంతో నిరంతర కృషి కొనసాగిస్తున్న డా. టి. పార్థసారధి అంచెలంచెలుగా ఎదిగారు. ఏలూరు జిల్లాకు చెందిన పార్థసారధి బి.ఎస్సీ పూర్తి చేసి, రెండు పిజిలు చదివారు. మక్కువతో ఎం.ఎడ్., ఎం.ఫిల్., కూడా అభ్యసించారు. పట్టుదలతో పి.హెచ్.డి. పట్టా కూడా అందుకున్నారు. ప్రభుత్వ విద్యాశాఖలో సుదీర్ఘకాలం పనిచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి (గిరిజన సంక్షేమ శాఖ ఆఫీసర్) హోదాలో ఉద్యోగవిరమణ పొందారు. ప్రకాశం గ్రూపు కళాశాలలకు గౌరవ డైరెక్టర్ గా, పలు విద్యాసంస్థలకు సేవలందిస్తున్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రపంచ రికార్డు సభల్లో తనవంతు భాగస్వామ్యం వహిస్తున్నారు. కొయ్యలగూడెం లో జాతీయ సాహిత్య సదస్సు నిర్వహించి అనేక మంది యువ కవులను భాగస్వామ్యం చేశారు. దశావతారాలు, రామాయణం , భాగవతం రచనలు ముద్రితం అయ్యాయి. అనేక పత్రికలలో వీరు వ్రాసిన కథలు, కవితలు, వ్యాసాలు సుమారు 500 ఆర్టికల్స్ ముద్రితం అయ్యాయి. వీరి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నుంచి వీరి పదవీకాలం లోని ముఖ్య మంత్రులు అందరి ద్వారా పలు అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక సభల్లో పలు పురస్కారాలు, సత్కారాలు పొందారు. అనేక సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థలు వివిధ సందర్భాల్లో ఘనంగా సత్కరించాయి. నిత్యం విద్యార్థులు మధ్య వుంటూ పేద పిల్లలకు ప్రోత్సాహం అందిస్తూ, శ్రీ శ్రీ కళా వేదిక లో అంచెలంచెలుగా ఎదిగి అనతికాలంలోనే తన కార్యక్రమాలతో ప్రశంసలు పొంది ప్రధాన కార్యదర్శి గా నియమితులైయ్యారు.

**పార్థసారధికి బిరుదు పట్ల పలువురి హర్షం :**

శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ తేలి పార్థసారధికి ప్రతిష్టాత్మక "కవిరత్న" బిరుదు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఐ.ఎస్.ఓ. గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పలు ప్రపంచ రికార్డు కార్యక్రమాలను నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు.

కవులు, కళాకారుల ప్రోత్సాహం కొరకు ప్రపంచ కవితోత్సవం - సాహిత్య సదస్సులు - కళా ప్రదర్శనలు - పుస్తకావిష్కరణలు తదితర సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల



ద్వారా ప్రపంచ సాహితీ, కళా చరిత్రలో అనేక వేడుకలు వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నాయి. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్, ప్రపంచ తెలుగు సాహితీ సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, అనేక బృహత్తర సాహితీ, కళా పండగల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించారు. విజయవంతంగా కార్యక్రమాల నిర్వహణతో తానేమిటో నిరూపించుకున్నారు. పార్థసారథి గారిని శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, విశిష్ట సేవలందిస్తున్నారు. "కవిరత్న" బిరుదు అందుకోనున్న సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, జాతీయ, రాష్ట్ర కమిటీ, జిల్లా శాఖ బాధ్యులు, పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## .మహిళా రైతు శ్రీ మతి పూజారి పుష్ప కు ఘనంగా నివాళులు!



**ధర్మవరం జనవరి 16:** ధర్మవరం సమీపంలో ని చెన్నేకొత్తపల్లి మండల కేంద్రం బసంపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు శ్రీ మతి పూజారి పుష్పకు ఆమె వర్ధంతి సందర్భంగా గురువారం పూజారి కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో భర్త పూజారి హరికుమార్ ,అన్న ఓబుళప్ప,వెంకటేష్ బసం పల్లి గ్రామానికి చెందిన వారు మిత్రులు ,శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు .అనంతరం గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేశారు.

## మహా కుంభ మేళాలో శ్రీవారికి
# వైభవంగా స్నపన తిరుమంజనం, చక్రస్నానం







**తిరుమల జనవరి 16:** ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన మహా కుంభ మేళాలో ప్రయాగ్ రాజ్ లోని దశాశ్వమేధ ఘాట్ వద్ద గురువారం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాసస్వామివారికి స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని పవిత్ర గంగా నది ఒడ్డున కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనం స్థానిక భక్తులను భక్తి పారవశ్యానికి లోను చేసింది. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, పురుష సూక్తం, నారాయణ సూక్తం, మొదలైన పంచ సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. సహస్రధారాపాత్రతో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదనంతరం శ్రీ చక్రతాళ్వార్ ను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ గంగా నదిలోకి తీసుకువెళ్లారు. అక్కడ శ్రీ చక్రతాళ్వార్ కు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, ఎస్టేట్ ఆఫీసర్ గుణ భూషణ్ రెడ్డి, సూపరింటెండెంట్ గురు రాజస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**కనిగిరి జనవరి 16 :** కనిగిరి నియోజకవర్గం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో గురువారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి డయాలసిస్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. డయాలసిస్ కి వచ్చే పేషెంట్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, డయాలసిస్ కేంద్రంలో సౌకర్యాలను పేషంట్ల వద్దకు స్వయంగా వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్ డి ఎస్ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.డాక్టర్ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి శాసనసభ్యునిగా ఎన్నికైన నాటినుండి కనిగిరి ప్రభుత్వ వైద్యశాలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేశారని, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని కనిగిరి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి .

కాంట్రాక్టర్లు సి డి పనులు ప్రారంభించాలి.

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



**పుట్టపర్తి, జనవరి 16:** శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోకాంట్రాక్టర్లు సిడి పనులు ప్రారంభించాలి అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారంకలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ PD NH, NHAI, రైల్వేలు మరియు R&B, అటవీ శాఖ, చిన్న నీటిపారుదల, భూ సేకరణ, పలు అంశాలపై సమీక్షించారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ 716 G :అనుబంధాలు మరియు పెండింగ్ సమస్యలను ఒక వారంలోపు పరిష్కరించాలి. భూ సమస్యపై ఎలాంటి సందేహాలు ఉన్న జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుని పోయి కొన్ని సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మార్వోలను ఆదేశించారు. చాగలేరు గ్రామ పౌరులతో మాట్లాడి భూగర్భ మార్గాన్ని క్లియర్ చేయాలని NH అధికారులకు ఆదేశించారు.ప్యాకేజీ 2,2.7 కి.మీ అటవీ భూమి పనుల పురోగతి అవసరం మరియు క్లియర్ చేయవలసిన మొత్తాన్ని స్కేనరైజ్ చేస్తుంది. NHAI కి ఒక లేఖ రాయండి, ఎవరికి చెల్లించాలో స్కేనరైజ్ మొత్తాన్ని స్పష్టత తీసుకొని ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్యాకేజీ3:వచ్చే వారం మొత్తం టవర్ షిఫ్టింగ్ వివరాలను సమర్పించాలి.ముదిగుబ్బ తహశీల్దార్ లైన్ షిఫ్టింగ్ వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ముందుగా ధరలను నిర్ణయించి జాబితాను సమర్పించాలి.లైన్ షిఫ్టింగ్ వివరాలను సమర్పించాలి. NH 342:ప్యాకేజీ 1, ప్యాకేజ్ 2 సమీక్షించారు సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు జారీ జేశారు. ఈ సమావేశంలో పెనుగొండ ఆర్డిఓ ఆనంద్, అశోక్ రెడ్డి డి ఈ గిడ్డయ్య, నేషనల్ హైవే మేనేజర్ ముత్యాలరావు, ఏపీ మైన్స్ అధికారి పెద్దిరెడ్డి, భూసేకరణ విభాగం అధికారులు , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 18న గుంటూరు, కడప జిల్లాలో సీఎం పర్యటన



: గుంటూరు, కడప జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నెల 18న ఈ పర్యటన ఉండనుంది. గుంటూరులో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సీఎం ప్రారంభించనున్నారు. 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్'ను కూడా ప్రారంభిస్తారు. అలాగే కడప జిల్లాలో జరగనున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## సత్య సాయి జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



**ధర్మవరం :జనవరి 16:** హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలలో పాల్గొనే సత్యసాయి జిల్లా హాకీ జట్టును హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్,సత్యసాయి జిల్లా సెక్రెటరీ బంధనాథం సూర్య ప్రకాష్,హాకీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు బి.వి శ్రీనివాసులు పత్రికా ముఖంగా ప్రకటించారు. జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ఇటీవల స్థానిక క్రీడా మైదానంలో జరిగిన విషయం విదితమే జట్టు సభ్యులుగా : శబరీష్ గౌడ్ ,ఫజులుద్దీన్, వెంకట్ అభిషిక్త్,రితీష్, రాంచరణ్,సాదిక్ వలి,గోవర్ధన్, జశ్వంత్,నవదీప్, ఆదికేశవ, విక్కీ,పోతలయ్య, స్వామి,సచిన్, కార్తీక్,ధనూష్, రాహుల్, పుణీత్ చరణ్ తేజ్,ఉన్నారు ఈ జట్టుకు శబరీష్ గౌడ్ కెప్టెన్ గా వ్యవహారిస్తారన్నారు .కోచ్ గా హస్సేన్,మేనేజర్ గా వెంకటేష్ నాయక్, వ్యవహరించనున్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి, జిల్లా జట్టును విజేతగా నిలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హాకీ సత్యసాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్,హాకీ సత్యసాయి జిల్లా జాయింట్ సెక్రెటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్టుకు హాకీ సత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్,పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర,ట్రెజరర్ అంజన్న, డైరెక్టర్లు మారుతి, అమునుద్దీన్, కిరణ్,ఇర్షాద్, శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతిపాదరంగానే పోలీస్ ఉద్యోగాలు







**- దళారులను నమ్మవద్దు**
**- సజావుగా పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుడ్య పరీక్షలు**
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**జనవరి 16 :**అనంతపురం జిల్లాలో పోలీసు ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగానేవస్తాయని దళారులు నమ్మి ఎవరు మోసపోవద్దని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా కానిస్టేబుల్ అభ్యర్థులు ఎంపిక జరుగుతుందని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారులి అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో గురువారం ఉదయమే ప్రారంభమైన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుడ్య పరీక్షలు ( PMT, PET) జిల్లా ఎస్పీ పి.జగదీష్ దగ్గరుండి సిసికెమేరాల పర్యవేక్షణలో దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా కొనసాగుతున్నాయి

ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డ్ (APSLPRB) నియమ నిబంధనలకు అనుగుణంగా... సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా దేహధారుడ్య పరీక్షల నిర్వహణ ఎత్తు, ఛాతి కొలతలు అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు మరియు లాంగ్ జంప్ పరీక్షలలో పాల్గొన్న పురుష అభ్యర్థులు ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగా మాత్రమే వస్తాయని ... ఎట్టి పరిస్థితుల్లోను దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అభ్యర్థులకు తెలియజేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఈనెల 8,9,10 తేదీలలో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 17,18 మరియు 20 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. అప్పీలు అభ్యర్థులు ఈనెల 21 న హాజరు కావాలని జిల్లా ఎస్పీపి జగదీష్ కోరారు.

## వైభవంగాజాతీయ రహదారి

# భద్రత మాసోత్సవాలను నిర్వహించాలి





**- : జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వతేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల యాక్టివిటీలు చేపట్టాలి**
**- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అనంతపురం, జనవరి 16 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు - 2025 పోస్టర్లను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు చాలా ముఖ్యమైనవన్నారు. ప్రమాదాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగిరాని పరిస్థితి ఉందని, ఇతరుల పొరపాటు వల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, దేశంలో జనాభా ఎక్కువ అని, ఉన్న మౌలిక సదుపాయాల్లోనే ఎలా భద్రతగా ఉండవచ్చు అనేదానిపై అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రహదారి భద్రత కార్యక్రమాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చేపట్టాలన్నారు. జిల్లాలో జనవరి 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వతేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల యాక్టివిటీలు చేపట్టాలన్నారు. ఈనెల 17వ తేదీన రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్స్, రిటైర్డ్ ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందిలతో వాలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్ తో గుర్తించడం, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, తదితర యాక్టివిటీలను చేపట్టాలన్నారు. ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయడం చేసి అక్కడ తగిన భద్రతా చర్యలు చేపట్టడం చేయాలన్నారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో కూడా బ్లాక్ స్పాట్లలో పరిశీలన చేయాలన్నారు. ఈనెల 24వ తేదీన డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25వ తేదీన పలు ఆక్టివిటీలు చేపట్టడం, 26, 27వ తేదీలలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి వాకథాన్ లు నిర్వహించడం, 30, 31వ తేదీలలో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి యాక్టివిటీలు చేపట్టాలన్నారు. ఇలా వచ్చే నెల 15వ తేదీ వరకు రహదారి భద్రత మాసోత్సవాలలో పలు యాక్టివిటీలను నిర్వహించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.



- ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి, డిటిసి వీర్రాజు, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా. కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్.హెచ్.ఏ.ఐ పిడి తరుణ్ కుమార్, ఆర్టీవోలు లక్ష్మీనారాయణ, రమేష్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, సునీత, రాజగోపాల్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కేఎల్ఎన్ ప్రసాద్, శ్రీనివాసులు, రఘునాథ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెటాలో 3600 మందిపై వేటు

ఐటి ఉద్యోగులకు మెడపై కత్తి వేలాడుతోంది. గత రెండేళ్లుగా టెక్ కంపెనీలు తమ ఉద్యోగులను ఎప్పుడు తొలగిస్తాయే తెలియని దుస్థితి నెలకొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర పలు కంపెనీలు తమ ఉద్యోగుల్ని వరుసగా తొలగిస్తున్నాయి. ఆర్థిక మాంద్యం భయాలు, పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందికి ఎసరు పెడుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన వేలాది ఉద్యోగులను ఇంటికి పంపించాలని నిర్ణయించింది. దాదాపు 3600 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. కంపెనీ తన అంతర్గత మెమోలో ఈ విషయాన్ని వెల్లడించింది. పేలవమైన పనితీరును కనబర్చిన వారికి ఉద్వాసన పలికినట్లు తెలిపింది. ఈ సంఖ్య దాదాపుగా మెటా మొత్తం ఉద్యోగుల్లో 5 శాతానికి సమానం. మార్క్ జుకర్‌బర్గ్ తీసుకున్న ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెటాలో దాదాపు 72,400 మంది ఉద్యోగులు ఉన్నారు. ఉద్వాసనకు గురైన ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను ఉద్యోగాల్లోకి తీసుకున్న సమయంలో నైపుణ్యాల గురించి తెలియలేదా..? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఆకస్మాత్తుగా తొలగింపు చేస్తే ఎలా అని అడుతున్నారు. కొత్త వారిని తీసుకున్న తమకంటే బాగా పని చేస్తారనే గ్యారంటీ ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల జీతాలు పెరిగే సమయంలో ఇలా ఏదో ఒక కారణం చెప్పి తొలగింపులకు పాల్పడుతున్నారని అంటున్నారు. ఇతర అమెరికన్ టెక్ కంపెనీల్లోనూ ఇదే తొలగింపుల పర్వం కొనసాగుతోంది. గత వారం మైక్రోసాఫ్ట్ కూడా తన ఉద్యోగులలో 1 శాతం మందిని తొలగించింది. ఈ వ్యక్తులందరినీ పేలవమైన పనితీరు జాబితాలో చేర్చింది. కంపెనీలో నిర్వహణ స్థాయిని పెంచాలని, పేలవమైన పనితీరు కనబరిచే ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. కృత్రిమ మేధా (ఎఐ) కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

## ఆయన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు..

వారానికి 90 గంటల పని వివాదం ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఇది ఎవరో అనామకులు అంటే ఎవ్వరూ పట్టించుకునేవారు కాదు. కానీ లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్ టీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ (ఎస్ఎన్ఎస్) చేశారంటూ వార్తలు రావడంతో అందరూ అవాక్కయ్యారు. ఈ వ్యాఖ్యలను పలువురు విమర్శించారు. ఈ వివాదం రోజురోజుకూ ముదురుపోతుండడంతో ఆ కంపెనీ హెచ్ఆర్ అధిపతి సోనికా మురళీధరన్ స్పందించారు. ఈ మేరకు ఓ వివరణాత్మక పోస్టు పెట్టారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, ఆ మాటల వెనుక ఉద్దేశం ఉద్యోగుల శ్రేయస్సు మాత్రమేనని ఆమె చెప్పుకొచ్చారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలను ఆ సందర్భం నుంచి బయటకు తీసి, తప్పుగా అన్వయించారని సోనికా అభిప్రాయపడ్డారు. కంపెనీలో జరిగిన అంతర్గత చర్చల్లో ఆయన ఎన్నడూ 90 గంటల పనివిధానాన్ని తప్పనిసరి చేయాలని కోరడం గానీ, సూచించడం గానీ చేయలేదన్నారు. ఆయన మాటల వెనుక ఉద్దేశం పని సమయాన్ని పెంచడం కాదని, నిజమైన ఉద్దేశాన్ని పక్కన పెట్టి, సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారన్నారు. ఆ సంస్థతో తనకు ఐదు సంవత్సరాల అనుబంధం ఉందని సోనిక తెలిపారు. ఉద్యోగులకు మద్దతు ఇవ్వడంలో సుబ్రహ్మణ్యన్ ఎల్లప్పుడూ ముందు ఉంటారన్నారు. ఉద్యోగులను తన కుటుంబంలా ఆయన భావిస్తారని, ఐక్యతా భావాన్ని పెంచేలా వ్యవహరిస్తారన్నారు. ఆయన ప్రకటన వెనుక ఉన్న సందర్భం, ఉద్దేశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలను కోరారు. కాగా.. ఎల్ అండ్ టీ హెచ్ ఆర్ అధిపతి సోనికా పెట్టిన పోస్టుపై కొందరు నెటిజన్లు స్పందించారు. వారిలో కొందరు వ్యంగ్యంగా పోస్టులు పెట్టారు. కుటుంబంతోనే సమయం గడపలేకపోయిన వ్యక్తి.. కార్పొరేట్ కుటుంబంలో ఇతరులతో ఎలా ప్రవర్తిస్తారని ప్రశ్నించారు.

## రాష్ట్ర చేనేత ప్రముఖులు గిర్రాజు నగేష్ ఇంటికి విచ్చేసిన

వైద్య,ఆరోగ్య,శాఖ మంత్రి సత్య కుమార్....



**ధర్మవరం జనవరి 16:** రాష్ట్ర వైద్య,ఆరోగ్య,శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ చేనేతల పండుగ సంక్రాంతి జ్యోతులు పండుగ సందర్భంగా ధర్మవరం లోని రాష్ట్ర చేనేత ప్రముఖులు గిర్రాజు నగేష్ గృహానికి విచ్చేసారు.ఈ సందర్భంగా గిర్రాజు నగేష్ దంపతులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.మంత్రి సత్య కుమార్ కు ఒక జ్ఞాపిక అందజేశారు.వారికి మంత్రి సత్య కుమార్ చేనేత జ్యోతుల పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.

## గొల్లాలమ్మ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు



**తూర్పుగోదావరి జిల్లా జనవరి 16:** అనపర్తి మండలం రామవరంలో శ్రీ గొల్లాలమ్మ జాతర సందర్భంగా అమ్మ వారిని దర్శించుకుని, జాతరను ప్రారంభించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల NDA నాయకులు, రామవరం గ్రామ NDA నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగాలమ్మ తీర్థ మహొూత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సత్తి



**తూర్పుగోదావరి జిల్లా జనవరి 16:** సంక్రాంతి పండగ సందర్భంగా అనపర్తి మండలం కొత్తూరు గ్రామంలో గంగాలమ్మ తీర్థ మహొూత్సవానికి హాజరైన అనపర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనపర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గారిని సన్మానించారు.వీరి వెంట సత్తి గంగిరెడ్డి , పడాల సత్తిరెడ్డి, చింతా అచ్చిరెడ్డి , చింతా రామకృష్ణారెడ్డి , పడాల శ్రీనివాసరెడ్డి , సత్తి గోవిందరెడ్డి, సత్తి సత్తిరెడ్డి, సబ్బెళ్ళ వెంకటరెడ్డి , సబ్బెళ్ళ సత్యనారాయణ రెడ్డి , సత్తి సుబ్బారెడ్డి , చింతా చక్రవర్తి, కొవ్వూరి దుర్గారెడ్డి , రెడ్డి కృష్ణారెడ్డి , సత్తి స్వామి, పండు, సత్తి సుబ్బారెడ్డి , సత్తి దుర్గారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితర ఆలయ కమిటీ సభ్యులు మరియు తదితర వైఎస్ఆర్సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూపాయి పతనం ఆర్‌బిఐకి సవాల్



అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం రికార్డ్ స్థాయిలో పడిపోతున్న నేపథ్యంలో రూపీ విలువ కట్టడిపై కేంద్రం దృష్టి పెట్టనుందని టాక్స్ కన్సల్టెంట్ సంస్థ యర్నెస్ట్ అండ్ యంగ్ (ఇవై) అంచనా వేసింది. రూపాయి పతనాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో దిగుమతులపై అధిక సుంకాలను విధించే అవకాశాన్ని పరిశీలించవచ్చని ఇవై చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాస్తవ పేర్కొన్నారు. దిగుమతులపై అధిక పన్నులతో డాలర్ల డిమాండ్‌ను అరికట్టగలదని పేర్కొన్నారు. శ్రీవాస్తవ ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సలహామండలి సభ్యుడిగా కూడా ఉన్నారు. “అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అకస్మాత్తుగా క్షీణించడంతో బడ్జెట్ రూపకర్తలకు, ద్రవ్య విధానపరంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ)కి సవాలుగా మారుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందనే అంచనాలతో ప్రపంచంలోని ఆర్థిక వనరులు అక్కడికి తరలిపోతున్నాయి. రూపాయి సహా ఇతర యూరోపియన్ కరెన్సీలు కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో రూపాయి పతన కట్టడికి రానున్న బడ్జెట్‌లో సుంకం రేట్లను పరిశీలించే అవకాశం ఉంది. దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు మద్ధతును లభించనుంది. ఫలితంగా దిగుమతి సుంకం ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది. దీంతో డాలర్‌కు డిమాండ్ తగ్గనుంది.” అని శ్రీవాస్తవ పేర్కొన్నారు. జనవరి 13న అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క రోజులోనే 66 పాయింట్లు పతనమై చరిత్రలోనే తొలిసారిగా 86.70 కనిష్ఠ స్థాయికి దిగజారింది. గత రెండు వారాల్లో దీని విలువ ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పడిపోయింది. ఈ క్రమంలో భారత కరెన్సీ పతనాన్ని అదుపు చేయడానికి సుంకాల పెంపు మద్దతును ఇవ్వనుందని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

# తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ పాదయాత్ర

**హైదరాబాద్ :** తెలంగాణలో ఓవైపు పాలన మరో వైపు పార్టీ బలోపేతం దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా వేగం పెంచింది. నెలాఖరుకు పెండింగ్ నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు, పీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్లాన్ చేసింది.మరో పాదయాత్రకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టనున్నారు. "సేవ్ కాన్‌స్టిట్యూషన్ పాదయాత్ర" (సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర) తెలంగాణ నుంచి ఈ యాత్ర ప్రారంభించేలా చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను కలిశారు. గణతంత్ర దినోత్సవం నాడు ప్రారంభం కానున్న ఈ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా వచ్చే నెల మొదటి పక్షం రోజుల పాటు ర్యాలీని ప్లాన్ చేశారు.రాజ్యాంగ విలువలను కాపాడవలసిన అవసరాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఎఐసిసి నేతృత్వంలో ఈ పాదయాత్ర సాగనుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అగౌరవపరిచారంటూ ఈ యాత్ర ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. జనవరి 8న గాంధీభవన్‌లో జరిగిన పిఎసి సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించిన పిఎసి ఏడాది పొడవునా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ర్యాలీలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనాలని కోరింది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక



సమావేశం జరిగింది. సీఎం రేవంత్ సహా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక భేటీ జరిగింది. రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. తెలంగాణ ర్యాలీకి సంబంధించిన వివరాలను ఖరారు చేయాలని కోరింది. అనంతరం మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్ ఖమ్మం లేదా సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, అక్కడ రాహుల్ గాంధీ కీలక ప్రసంగం చేయాలని కోరినట్లు తెలిపారు. నెలాఖరులోగా ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రభుత్వ సంస్థల్లో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. అయితే, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన ఆయన, తుది నిర్ణయం పార్టీ హైకమాండ్, ముఖ్యమంత్రిదేనని పేర్కొన్నారు. టీపీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ప్రజల్లో చురుగ్గా పని చేసే నాయకులకే డీసీసీ అధ్యక్ష పదవులు వచ్చేలా చూస్తామన్నారు.

# కేటీఆర్ ఈడీ విచారణ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**హైదరాబాద్ :** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈడీ గురువారం విచారిస్తోంది. గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరిన కేటీఆర్ నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది సిబ్బంది మోహరించగా.. బాష్పవాయువు, వాటర్ కెనాన్లను అందుబాటులో ఉంటారు. కేటీఆర్ విచారణకు హాజరయ్యే సమయంలోనే భారీ సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకోగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు, కేటీఆర్ విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వెళ్లే రహదారిపై ఇరువైపులా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ వద్ద కూడా భారీగా బందోబస్తు చేపట్టారు.కాగా, దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. గురువారం కేటీఆర్‌ను ఈడీ విచారిస్తోంది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపైనా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు రూ. 45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఏసీబీ నుంచి వివరాలు తెప్పించుకున్న ఈడీ మరింత లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.ఒప్పందాల్లో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు ఎవరు. ఫెమా నిబంధనలను ఉల్లఘించి విదేశీ కంపెనీకి నిధులు ఎంత పంపారు. ఎలా పంపారు. అవి చివరికి ఎవరి ఖాతాలో పడ్డాయి. ఇందులో కేటీఆర్‌తోపాటు అధికారు పాత్ర ఎంత. ఏ ఉద్దేశంతో ఈ వ్యవహారం నడచింది. అన్న వివరాలను ఈడీ తెలుసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఈడీ కేటీఆర్‌పైకేసు పట్టే అవకాశాలను పరిశీలంచనుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్,



బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'డిస్మిస్డ్ యూజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అటు, రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ పెడుతున్న కేసులు తమ ఘనతను తుడిచేయలేవని అన్నారు.

**'రాజకీయ వేధింపులే'**

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరయ్యారు. గచ్చిబౌలిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'డిస్మిస్డ్ యూజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ. 45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు.

కాగా, ఈడీ విచారణకు హాజరయ్యే ముందు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అన్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో ఒకటి. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ నగరాన్ని కీర్తించారు. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుంది. తప్పు లేకపోయినా ఏదో కాలం వెల్లదీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. త్వరలోనే తప్పకుండా నిజం తెలుస్తుంది.' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై రేవంత్ పోరుబాట

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని నిర్ణయించింది. విభజన చట్టం ప్రకారం ఏదైనా నదిపై ప్రాజెక్టు నిర్మించాలంటే పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని అది ఇవ్వకుండానే ప్రాజెక్టు ప్రకటన చేశారని ఆగ్రహంతో ఉంది తెలంగాణ. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య తాజా వివాదానికి కారణమయ్యేలా ఉంది. దీనిపై పోరాటం చేయాలని రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది. నదుల అనసంధానం చేస్తామని ఇప్పటికే ప్రటించిన చంద్రబాబు ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రకటించారు. తమను సంప్రదించకుండా ఇలా ప్రాజెక్టు ప్రకటించడంపై అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై కేంద్ర స్థాయిలో పోరాటానికి సిద్ధమైంది. ఏపీ చేపట్టే నదుల అనుసంధాన ప్రాజెక్ట్ బనకచర్లపై అభ్యంతరం చెబుతూ కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఘాటైన లేఖ రాయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎందుకు అభ్యంతరం చెబుతోంది... అనే వివరాలు తెలియజేస్తూ లేఖలు రాయాలని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా, ఏ నదిపైనైనా ప్రాజెక్టు చేపడితే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీసహా పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని ఏపీ పునర్విభజన చట్టం స్పష్టం చేస్తోందని అంటోంది తెలంగాణ. ఇదే విషయాన్ని లేఖలో రాయాలని నిర్ణయించారు. నీటి పారుదల శాఖపై సమిక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి బనకచర్లపై అభ్యంతరం తెలియజేస్తూ లేఖ రాయాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కృష్ణా నదీ జలాల విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తి వద్దని సూచించారు. ట్రైబ్యునల్స్‌లో గట్టి వాదనలు వినిపించాలని స్పష్టంచేశారు. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3 ప్రకారం జలాలు కేటాయించేలా వాదించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముప్పు అంశంపై కూడా హైదరాబాద్ ఐఐటీతో చేయిస్తున్న స్టడీ విలైనంత త్వరగా పూర్తి చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు, వాటి అనుమతుల విషయంలో ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

## వివాహేతర సంబంధం... చివరకు ఏం జరిగిందంటే..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పుప్పాలగూడలో జరిగిన జంట హత్యలు కలకలం రేపిన విషయం తెలిసిందే.. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగుచూశాయి.. అనంత పద్మనాభస్వామి ఆలయ సమీపంలోని గుట్టల వద్ద దారుణ హత్యకు గురైన యువతి, యువకుడిని పోలీసులు గుర్తించారు. యువకుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత్ సాకేత్ (25) గా, మహిళను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిందు దివాకర్ (25) గా గుర్తించారు. అయితే.. వివాహేతర బంధమే ప్రాణాలు తీసిందని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే.. డబుల్ మర్డర్ కు కొద్దిరోజుల ముందు బిందు, సాకేత్ అదృశ్యమైనట్టు వేర్వేరు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. దీంతో హత్యకు గురైంది వారిద్దరేనని పోలీసులు నిర్ధారించారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లు సమచారం..పోలీసులు, స్థానికుల సమాచారం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిందు, దివాకర్ దంపతులు? ఉపాధి కోసం కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ దంపతులు మొదట్లో శంకర్‌పల్లిలో ఉండేవారు. దివాకర్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు.. అయతే.. అక్కడ నివసించే సమయంలో హౌస్‌కీపింగ్ పనిచేసే సాకేత్‌తో బిందుకు పరిచయం ఏర్పడింది.. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇది తెలిసి దివాకర్ తన కుటుంబాన్ని వనస్థలిపురంలోని చింతల్‌కుంటకు మార్చాడు.అయితే.. ఆ తర్వాత కూడా వీరు కలుసుకునేవారు.. ఈక్రమంలోనే.. కొద్దిరోజుల క్రితం బిందు, సాకేత్ ఇళ్లనుంచి బయటకు వెళ్లిపోయారు.. భార్య కనిపించడం లేదని దివాకర్ ఈనెల 8న వనస్థలిపురంలో ఫిర్యాదు చేశాడు.. 11న సాకేత్ మాయమయ్యాడని అతని సోదరుడు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు..ఈ క్రమంలోనే.. ఈనెల 14న నార్సింగి పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి గుట్టల్లో రెండు మృతదేహాలున్నట్టు స్థానికులు నార్సింగి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.. క్వారీగుంత వద్ద సాకేత్ మృతదేహం ఉండగా.. ఒంటిపై కత్తిపోట్లు, ముఖంపై గ్రానైట్‌రాయితో కొట్టినట్టు ఆనవాళ్లు లభించాయి.. కొద్ది దూరంలో బిందు మృతదేహం ఉంది. తలపై రాయితో కొట్టినట్లు గాయలున్నాయి. ఈనెల 11న వీరిద్దరూ హత్యకు గురై ఉండొచ్చని, హత్యాప్రదేశంలో నలుగురుకు మించి ఉండొచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.. ఇదే ప్రదేశంలో మద్యం సీసాలు కూడా లభించాయి.. అయితే.. హత్యకు ముందు ఏం జరిగిందన్న విషయంపై పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.సాకేత్ బిందుతో వ్యభిచారం చేయిస్తున్నట్లు సమాచారం.. ఈనెల 8న వనస్థలిపురం వెళ్లిన సాకేత్ బైకుపై బిందును తీసుకొని నానక్‌రామ్‌గూడ చేరాడు. అక్కడ ఓ మిత్రుడి గదిలో మూడు రోజులు ఉన్నాడు.. 11న ఫోన్‌కాల్ రావటంతో సాకేత్, బిందు అనంతపద్మనాభస్వామి గుట్టల వద్దకు చేరుకుని? అక్కడున్న వారితో కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత గొడవ జరిగిందని.. హత్యలకు దారి తీసిందని పోలీసులు భావిస్తున్నారు. కాగా.. నిందితుల కోసం 5బృందాలు గాలిస్తున్నాయి. ఓ బృందం మధ్యప్రదేశ్ వెళ్లినట్టు పేర్కొంటున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాలు

తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి. కారును లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ సహా చిన్నారి మృతి చెందింది. అటు, ఏపీలో సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. భువనగిరి మున్సిపాలిటీ రాయగిరి సమీపంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తోన్న ఓ మహిళ సహా చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన వారిగా గుర్తించారు. కారు పూర్తిగా లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోగా.. జేసీబీ సాయంతో బయటకు తీశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సముద్ర స్నానానికి వెళ్లి..**

అటు, సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన ఏపీలోని అనకాపల్లి జిల్లాలో జరిగింది. యస్.రాయవరం మండలం రేవుపోలవరం తీరంలో సముద్ర స్నానానికి ఇద్దరు విద్యార్థులు బుధవారం వెళ్లారు. అలల ఉద్ధృతిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు కాకర మణికంఠ (18), పసనబోయిన సాద్విక్ (10)గా గుర్తించారు. వీరు తుని మండలం లోవకొత్తూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

## హరి నగరం సమీపంలో రెండు మోటార్ సైకిల్ ఢీ...

ఇద్దరు కానిస్టేబుల్ లకు తీవ్ర గాయాలు...

మరో వ్యక్తికి స్వల్ప గాయాలు.

**రుద్రవరం :** మండలంలోని హరినగరం సమీపంలో బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిల్ లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు కానిస్టేబుల్ లకు తీవ్ర గాయాలుగా మరో వ్యక్తి స్వల్పంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు అహోబిల లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాలకు బందోవస్తుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో సంజామల పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాముడు, దొర్నిపాడు పోలీస్ స్టేషన్ లోపనిచేస్తున్న చిన్న బాబు మోటార్ సైకిల్ పై ఆళ్లగడ్డ వైపు వస్తుండగా రుద్రవరం గ్రామానికి చెందిన రమణ, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి మోటార్ సైకిల్ పై అహోబిలం వైపు వెళ్తుండగా హరి నగర సమీపంలోని నవ అహోబిలం కాంప్లెక్స్ దగ్గర రెండు మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడగా రమణ స్వల్పంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిని 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ఆ నాలుగు మండలాలకు మహర్దశ

**హైదరాబాద్ :** హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీలు గణనీయమైన అభివృద్ధిని సాధించాయి. నగర విస్తరణలో భాగంగా రేవంత్ సర్కార్ ఫోర్త్ సిటీ పేరుతో ఫ్యూచర్ సిటీని ప్లాన్ చేస్తోంది. అందుకు సంబంధించిన కార్యచరణ ప్రారంభించింది. రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు సర్కార్ శరవేగంగా ప్రణాళికలను రెడీ చేస్తోంది. ఫోర్త్ సిటీ చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను సేకరించేందుకు ఇప్పటికే రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు.రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఆరు మండలాల్లో ఈ పరిశ్రమలు స్థాపించనున్నారు. ఔటర్‌కు సమీపంలోని కొన్ని, ఎయిర్‌పోర్టుకు దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. ఆరు మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు స్థలాలిచ్చి ఇప్పటికీ కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఫోర్త్ సిటీకి పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్తగా పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే షాబాద్ మండలంలో ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కొత్తగా ఆయా ప్రాంతాల్లో ఐటీ, పరిశ్రమల హబ్‌లతో పాటు ఎడ్యుకేషన్ ఇనిస్ట్యూషన్స్, గేమింగ్ జోన్స్, రెస్టారెంట్లను ప్రారంభిస్తే రానున్న నాలుగైదేళ్లలో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతమవుతుందని అధికారులు భావిస్తున్నారు.చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఘట్‌కేసర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం మండలాల పరిధుల్లో ప్రభుత్వ స్థలాల వివరాలను అధికారులు ఇప్పటికే సేకరించారు. ఒక్కో ప్రాంతంలో కనీసం 1000 ఎకరాలు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. సెజ్ తరహాలో ఒకేచోట 200, 300 ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ ఉద్యోగులు, కార్మికులు నివాసముండేందుకు వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు.

# యూరిక్ యాసిడ్ స్థాయిలను ఎలా తగ్గించాలి ?



యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడానికి కొన్ని జ్యూస్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఉదయాన్నే నిమ్మరసం, వాము (అజ్వైన్) వాటర్, గూస్బెర్రీ జ్యూస్, తులసి టీ, పసుపు టీ, అల్లం టీ, దోసకాయ రసం వంటివి శరీరంలో టాక్సిన్లు తొలగించడంతో పాటు యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ జ్యూస్‌లు జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, శరీరాన్ని శుద్ధి చేస్తాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలను ఎలా తగ్గించాలి ? మన ఆరోగ్యం కోసం కొన్ని ఇంట్లో చేసే జ్యూస్ లు తీసుకోవడం చాలా ముఖ్యం. ఉదయాన్నే ఈ జ్యూస్ లను తాగడం వల్ల శరీరంలో ఉన్న యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గుతాయి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఈ జ్యూస్ ఏంటి ఇవి యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో ఎలా సహాయపడుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం. నిమ్మరసం ఉదయాన్నే ఒక గ్లాసు నిమ్మరసం తాగడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించవచ్చు. నిమ్మరసం విటమిన్ %జ%తో నిండి ఉంటుంది. ఇది శరీరంలో టాక్సిన్లు తొలగించడంలో సహాయపడుతుంది. వాము (అజ్వైన్) వాటర్ యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. అందువల్ల శరీరంలో టాక్సిన్లు తొలగిపోతాయి, యూరిక్ యాసిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. వాము లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలోని వాపులను తగ్గించి ఆపై యూరిక్ యాసిడ్ స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ఈ వాటర్ శరీరాన్ని శుద్ధి చేయడమే కాకుండా.. మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. అలాగే మెటాబాలిజాన్ని వేగవంతం చేస్తుంది. తద్వారా శరీరంలో టాక్సిన్లు త్వరగా బయటకు పోతాయి. గూస్బెర్రీ జ్యూస్ కూడా యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది విటమిన్ జతో నిండి ఉంటుంది. దీంతో శరీరంలో ఉన్న టాక్సిన్లు తొలగిపోతాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల మీ స్కిన్ కూడా ఆరోగ్యంగా మారుతుంది. తులసి టీ యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది శరీరంలోని ఇన్ఫ్లమేటరీ సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే తులసి టీ తాగడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. పసుపు టీ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో కూడుకున్నది. ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపు టీ తాగడం ద్వారా మీరు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. అల్లం టీ కూడా యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అల్లం లో ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలో ఉండే ఇన్ఫ్లమేటరీ లక్షణాలను తగ్గిస్తాయి. దీని వల్ల మీరు ఆరోగ్యంగా ఉండవచ్చు.

## యాలకులతో గుండె ఆరోగ్యం పదిలమే!



వంటకాలకు కమ్మటి సువాసనతోపాటు ఆహారానికి మంచి రుచిని ఇచ్చే యాలకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. అయితే వీటిని ఎల్లప్పుడూ పరిమిత మోతాదులోనే తీసుకోవాలి. ముఖ్యంగా యాలకులు తీసుకోవడం వల్ల గుండెతోపాటు శరీరంలో వివిధ సమస్యలు ఇట్టే మాయమవుతాయి.యాలకులు వంటకాలకు మంచి సువాసనతో పాటు రుచిని కూడా రెట్టింపు చేస్తాయి. అందుకే యాలకులను మసాలా దినుసుల రారాణిగా పిలుస్తారు. దీని ఔషధ గుణాల కారణంగా సాంప్రదాయ వైద్యంతోపాటు వివిధ రకాల వంటకాలలో యాలకులను విరివిగా ఉపయోగిస్తుంటాం.యాలకులు అల్లం కుటుంబానికి చెందిన ఎలిటేరియా, అమోమమ్ మొక్కల విత్తనాల నుంచి లభిస్తుంది. ఇందులోని మరో ప్రత్యేకత ఏంటంటే.. దీన్ని తీపి వంటకాల్లోనే కాకుండా రుచి కోసం పలు కూరల్లోనూ ఉపయోగిస్తారు. టీ, కాఫీ వంటి పానీయాలలో కూడా విస్తృతంగా ఉపయోగిస్తుంటాం. ఇందులో అనేక ఔషధ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇది జీర్ణక్రియ నుంచి శ్వాసను ఫ్రెష్ చేయడం వరకు అన్నింటికీ సహజమైన డిటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది. యాలకులలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే ఆయుర్వేద నిపుణులు దీనిని పోషకాహారానికి పవర్‌హౌస్ అంటారు. ఇందులో జింక్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ సి వంటి ముఖ్యమైన ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. వికారం, వాంతులు, అజీర్ణం వంటి జీర్ణ రుగ్మతల చికిత్సలో యాలకులు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అలాగే ఇది ఎసిడిటీని తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే మితంగా తీసుకోవడం మంచిది. యాలకులు యాంటీమైక్రోబయాల్ లక్షణాలను కలిగి ఉంటాయి.

## ఈ డ్రింక్స్ పరగడుపున తాగి చూడండి



చలికాలం వచ్చిందంటే ఒంట్లో యూరిక్ యాసిడ్ నిల్వలు పెరిగిపోతాయ్. దీంతో రకరకాల ఆరోగ్య సమస్యలు చుట్టు ముడతాయి. ఈ సమస్యను నేచురల్ గా వదిలించుకోవాలంటే కొన్ని చక్కని చిట్కాలు చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా వంట గదిలో దొరికే పదార్థాలతో చేసిన పానియాలు పరగడుపున తాగితే కొన్ని రోజుల్లో ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్ సమస్య చాలా మందిని వేధిస్తుంది. రక్తంలో ఇది పెరిగితే వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇటీవల కాలంలో ఈ సమస్య చాలా మందిలో రోజురోజుకు పెరుగుతోంది. ఫలితంగా కీళ్లలో నొప్పి కనిపిస్తుంది. అందుకే యూరిక్ యాసిడ్ నియంత్రణలో ఉంచుకోవడం అవసరం. దీన్ని నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా కొన్ని రకాల పదార్థాలతో చేసిన హెల్తీ డ్రింక్స్ ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకుంటే ఈ సమస్య నుంచి సులువుగా బయటపడవచ్చు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్‌ను తగ్గిస్తుంది. యాసిడ్ ఏర్పడకుండా చేస్తుంది. ఇందులోని నీరు యూరిక్ యాసిడ్‌ని వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. గూస్బెర్రీ రసం కూడా తాగవచ్చు. ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. శరీరంలో పెరిగిన యూరిక్ యాసిడ్‌ను నియంత్రిస్తుంది. తులసి ఆకులను నీటిలో బాగా మరిగించి టీలా తాగవచ్చు. తులసి ఆకులు శరీరంలోని అదనపు యూరిక్ యాసిడ్‌ను తొలగించడంలో సహాయపడతాయి. అలాగే పచ్చి అల్లం ముక్కలను నీటిలో బాగా మరిగించి, వడగట్టి తాగడం వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను నియంత్రిస్తుంది. ఇది సహజంగా యూరిక్ యాసిడ్‌ను నియంత్రిస్తుంది. రాత్రి పడుకునేటప్పుడు ఒక గ్లాసు నీళ్లలో కొన్ని మెంతి గింజలను వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే లేచి ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలే కాకుండా యూరిక్ యాసిడ్ కూడా తగ్గుతుంది. లేదంటే ఒక కప్పు నీటిలో బార్లీ వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. తర్వాత వడకట్టి తాగాలి. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్ మొత్తాన్ని నియంత్రిస్తుంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే చక్కని ఫలితాలు పొందొచ్చు.

# పవర్‌ఫుల్ దివ్యౌషధం.. ఆ సమస్యలను మడతపెట్టేస్తుంది



కీరదోసల్లో ఎన్నో రకాల పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల పలు జబ్బులు సులభంగా నయమవుతాయి. అందుకే వీటిని ఎక్కువగా సలాడ్స్‌లో ఉపయోగిస్తారు. అంతేకాకుండా స్నాక్స్‌లా తింటుంటారు. కీర దోస తినడం వల్ల బరువు తగ్గడంతోపాటు.. గుండెజబ్బుల సమస్యలు దూరమవుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పోషకాలు అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.. కీరలోని పోషకాలు కణజాలాలను బలోపేతం చేసేందుకు దోహదపడతాయి. మనం సాధారణంగా కీరదోసకాయను సలాడ్ రూపంలో తింటాము.. ముఖ్యంగా వేసవిలో దాని డిమాండ్ పెరుగుతుంది.. ఎందుకంటే ఇది మన శరీరాన్ని డీహైడ్రేషన్ నుండి రక్షిస్తుంది.. అయితే, వేసవికాలంతోపాటు శీతాకాలంలో దోసకాయ తినడం ఆరోగ్యానికి చాలా మంచిది.. చల్లని వాతావరణంలో కీరదోస తినడం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: కీరదోసకాయ మన కడుపులోని వేడిని తగ్గించేందుకు సహాయపడుతుంది.. అలాగే కడుపును చల్లగా ఉంచేలా చేస్తుంది. ఇందులో కరిగే ఫైబర్ ఉంటుంది.. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే, ఇందులో నీరు సమృద్ధిగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది.. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది.. ఇంకా ప్రేగు కదలికను మెరుగుపరుస్తుంది. చర్మానికి మేలు చేస్తుంది: కీరదోసకాయలు మన చర్మానికి చాలా ప్రయోజనకరంగా పరిగణిస్తారు. అందుకే దీనిని అనేక ఫేస్ ప్యాక్‌లు, సౌందర్య ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. కీరదోసకాయలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి.. కాబట్టి మనం దీనిని తింటే చర్మం సహజంగా కాంతివంతంగా మారుతుంది. హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గుతుంది: హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గించేందుకు, నివారించడానికి కీరదోసకాయలు తప్పనిసరిగా తినాలి. ఈ కూరగాయలలో డైటరీ ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీని కారణంగా అధిక రక్తపోటు సమస్య ఉండదు. గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. బరువు తగ్గుతుంది: చలికాలంలో కీరదోసను రెగ్యులర్‌గా తింటే క్రమంగా బరువు తగ్గుతారు.. వాస్తవానికి చలి వల్ల చాలామంది ఇంటి నుంచి బయటకు వెళ్ళడానికి ఇష్టపడరు.. దీని కారణంగా శారీరక శ్రమ కూడా తగ్గుతుంది. ఈ కాలంలో ఆయిల్ ఫుడ్ కు బదులు దోసకాయ తింటే.. క్యాలరీలు తీసుకోవడం తగ్గడమే కాకుండా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఎముకలకు మంచిది: రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, ఎముకలు పటుత్వాన్ని కోల్పోకుండా కాపాడటంలోనూ కీరదోసకాయలు సహాయపడుతాయి.

# బిజినెస్

## జుకర్‌బర్గ్ వ్యాఖ్యలకు మెటా ఇండియా క్షమాపణ



భారత్‌లో ఎన్నికలు, ప్రభుత్వం గురించి ఫేస్‌బుక్ సిఇఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో ఆయన తరపున మెటా ఇండియా క్షమాపణలు చెప్పింది. 2024 ఎన్నికల్లో భారతదేశంలోని ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోతుందని జుకర్‌బర్గ్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. మెటా ఇండియా ఉపాధ్యక్షుడు శివనాథ్ తుక్రాల్ ఎక్స్‌తో మాట్లాడుతూ, అధికారంలో వున్న అనేక పార్టీలు 2024 ఎన్నికల్లో తిరిగి గెలవలేవని చెప్పామని, ఇది అనేక దేశాల విషయంలో నిజమైనప్పటికీ, భారత్ విషయంలో నిజం కాలేదని పేర్కొన్నారు. అనుకోకుండా జరిగిన ఈ పొరపాటుకు తాము క్షమాపణలు చెబుతున్నామని ఆయన పేర్కొన్నారు. మెటాకు సంబంధించి భారత్ విశ్వసనీయమైన, ముఖ్యమైన దేశమని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ వినూత్న భవిష్యత్తులో తాము కూడా కేంద్రంగా వుండాలని ఆశిస్తున్నామన్నారు. దీనిపై బిజెపి నేత, కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ అయిన నిషికాంత్ దూబే స్పందిస్తూ క్షమాపణలు చెప్పినందున ఇక ఈ విషయం ఇంతటితో ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు.

## ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్




భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ, స్టార్టప్ ఇండియా, రాష్ట్ర-స్థాయి విధానాలు, అలాగే పెరుగుతున్న ప్రతిభ, డిజిటల్ కనెక్టివిటీ వంటి ప్రభుత్వ కార్యక్రమాలతో మౌలిక సదుపాయాలు బలమైన మద్దతు పలుకుతున్నాయి. భారతీయ స్టార్టప్‌లు దేశీయ సవాళ్లను పరిష్కరించడమే కాకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరిస్తున్నాయి. సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం భారత ప్రభుత్వం ప్రారంభించిన "స్టార్టప్ ఇండియా" దేశాన్ని 3వ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా తీర్చిదిద్దింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ రంగాల్లో సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే యువతను ప్రోత్సహించడం కోసం ఏర్పడిన స్టార్టప్ ఇండియా 2025 జనవరి 16 నాటికి తొమ్మిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని 10వ ఏటలోకి అడుగు పెడుతోంది. ఈ సందర్భంగా జనవరి 16ను కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్టార్టప్ డేగా పేర్కొంటూ.. తొమ్మిదేళ్ల ప్రయాణంలో అధిగమించిన మైలురాళ్లు, సాధించిన విజయాలను వెల్లడించింది. భారత ప్రభుత్వం "స్టార్టప్ ఇండియా" పేరుతో సరికొత్త ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక వనరులు కల్పించడం, వివిధ శాఖల నుంచి అనుమతులు కల్పించడంలో సహకరిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. దీనికి తోడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఇంజనీరింగ్, సైన్స్ రంగాల్లో చదువుకున్న యువత కూడా పెద్ద సంఖ్యలో ఉండడం కలిసొచ్చింది. వీటన్నింటికీ మించి ప్రపంచంలోని ఏ ఇతర దేశంతో పోల్చినా సరే ఇక్కడ తక్కువ ఖర్చుతో కంపెనీలను ఏర్పాటు చేయడం, తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగల్గడం భారత్‌లోనే సాధ్యపడుతోంది. ఇవన్నీ ప్రస్తుతం భారత్‌ను స్టార్టప్ ఎకోసిస్టమ్‌లలో 2-3 స్థానాల్లో నిలబెడుతోంది.

# మలేషియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పతనం



దేశంలో నూనెగింజల పంటలు పెద్దఎత్తున ఉత్పత్తి అవుతున్నప్పటికీ డిమాండ్‌కు తగ్గట్టుగానే వంటనూనెలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇటీవలి కాలంలో గ్లోబల్ మార్కెట్‌లో పామాయిల్ ధరలు పెరుగుతున్నాయి. దీని కారణంగా ఇతర నూనెలు సోయాబీన్, పొద్దుతిరుగుడు దిగుమతి 13 శాతం పెరిగింది. మరోవైపు మలేషియా స్టాక్ ఎక్స్ఛేంజ్ పతనం వంటనూనెలపై పడుతోంది. మలేషియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పతనం కారణంగా, దేశీయ చమురు-నూనె గింజలపై తీవ్ర ప్రభావం పడింది. దేశంలోని చమురులో ఆవాలు-నూనె గింజలు, వేరుశెనగ నూనె, సోయాబీన్ నూనె, ముడి పామాయిల్, పత్తి గింజల నూనె ధరలు పెరిగాయి. నూనెగింజల మార్కెట్‌లో నష్టాలు చవిచూశాయి. అయితే ఇవాళ కాస్త నూనె గింజల ధరలు మెరుగుపడుతుండగా, వేరుశనగ నూనె గింజలు, సోయాబీన్ నూనె గింజల ధరలు మునుపటి స్థాయిలోనే ఉన్నాయి. అయితే దేశీయంగా ఎడిబుల్ ఆయిల్స్ ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఆవాల బంపర్ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో ఇదీ పరిస్థితి. ఇప్పటికీ ఆవాల నూనె కిలోకు పది రూపాయలు పెరిగింది. ఈ విధంగా వేరుశెనగ నూనె ధరలు రూ.15 నుంచి 20 పెరగ్గా, శుద్ధి చేసిన సోయాబీన్ ధరలు కూడా రూ.10 నుంచి 15 వరకు పెరిగాయి. విదేశీ నూనెలు కూడా పెరిగాయి. ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో వంటనూనెల ధరలు స్పెక్యులేటర్లపైనే ఆధారపడి ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే నూనెల ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో వేరుశనగ, పత్తి గింజల ధరల్లో మెరుగుదల కనిపించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ నూనె గింజల ధరల్లో క్వింటాల్‌కు రూ.15-20 మెరుగుపడడం, ఈ నూనె గింజల ఎడిబుల్ ఆయిల్ ధరలు తగ్గడం, వేరుశనగ నూనె, పత్తి గింజల తగ్గుదలకు ప్రధాన కారణం. నూనె. సోయాబీన్ డీగమ్ ఆయిల్ దిగుమతికి కిలోకు రూ.102 వస్తుందని మార్కెట్ వర్గాలు తెలిపారు. కానీ డబ్బు సమస్య కారణంగా దిగుమతిదారులు ఈ నూనెను ఓడరేవుల్లో కిలో రూ.97 ధరకు విక్రయిస్తున్నారు. ఈ తక్కువ ధరకు విక్రయించడం వల్ల సోయాబీన్ నూనె ధరలు తగ్గుతున్నాయి. మలేషియా ఎక్స్ఛేంజ్ పతనం కాకుండా, అధిక ధరలకు కొనుగోలు చేయకపోవడంతో సీపీఓ, పామోలిన్ ఆయిల్ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ నూనెల ధరలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయని, వాస్తవానికి కొనుగోలుదారుల కొరత చాలా ఎక్కువగా ఉందంటున్నారు మార్కెట్ వర్గాలు.

# పసిడి ప్రియులకు అలర్ట్



భారతీయులు పసిడి ప్రియులు. మన దేశంలోని మహిళలకు బంగారం అంటే ఎంత ఆసక్తి ఉంటుందో చెప్పక్కర్లేదు. కానీ కొన్నాళ్లుగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. తగ్గేదే లే అంటూ పరుగులు పెడుతున్నాయి. పుత్తడి ధరలు రెక్కలొచ్చి ఆకాశానికి చేరుతున్నాయి. ఇక సామాన్యులకు బంగారం ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. పండగలకు, శుభకార్యాలకు పసిడి కొనడం ఒక కలగానే మారిపోతుంది. నిన్నటి వరకు బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. మరీ ఈరోజు దేశీయ మార్కెట్ తోపాటు హైదారాబాద్, విజయవాడ మార్కెట్లలో తులం బంగారం ధర ఎంత ఉందో తెలుసా.. నిన్న (జనవరి 15న) పసిడి ధరలు స్వల్పంగా తగ్గిన సంగతి తెలిసిందే. ఈరోజు సైతం పసిడి ధరలలో ఎలాంటి మార్పులు లేవు. కేవలం రూ.10 పెరిగింది. దీంతో ఈరోజు ఉదయం 7 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,080 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,410 వద్ద కొనసాగుతుంది. దేశీయ మార్కెట్లో ఒక గ్రాము బంగారం ధర రూ.7,341గా ఉంది. అంటే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,080 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,410 వద్ద కొనసాగుతుంది. ఇక దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. దేశీయ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,023 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,560 వద్ద కొనసాగుతుంది.దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,023 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,560 వద్ద కొనసాగుతుంది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,080 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,410 వద్ద కొనసాగుతుంది.బెంగుళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,080 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,410 వద్ద కొనసాగుతుంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 80,080 ఉండగా.. 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.73,410 వద్ద కొనసాగుతుంది.

## టీమిండియా ఆటగాళ్లకు బీసీసీఐ షాక్!

# మళ్లీ అమలులోకి యో యో టెస్ట్?



టీమిండియా వరుస సిరీస్‌లలో ఓటమి చవిచూసింది. మరీ ముఖ్యంగా హెడ్‌కోచ్‌గా గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత క్రికెట్ జట్టు ప్రదర్శన ఏమాత్రం బాగా లేదు. ఆటగాళ్ల పేలవమైన ఫామ్ కారణంగా వరుస సిరీస్‌లలో పరాజయం పాలైంది. ఈ క్రమంలో బీసీసీఐ కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా కొనసాగిన సమయంలో అమలులో ఉన్న పాత ఫిట్‌నెస్ టెస్ట్ రూల్స్‌ను తిరిగి ప్రవేశపెట్టేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తుందని సమాచారం. అయితే, ఆటగాళ్లపై పనిభారం, ప్రయాణాన్ని పరిగణలోకి తీసుకొని బోర్డు గతంలో అమలులో ఉన్న యో-యో ఫిట్‌నెస్ టెస్ట్‌ను రద్దు చేసింది. ఈ తాజాగా ఈ విధానాన్ని మళ్లీ తీసుకురావాలని యోచిస్తున్నట్లుగా బీసీసీ వర్గాలు తెలిపాయి. కఠినమైన ఫిట్‌నెస్ టెస్ట్‌తో ఆటగాళ్లు ఇబ్బందులుపడుతున్నారనే కారణంతో యో యో టెస్ట్‌ను బీసీసీఐ పక్కన పెట్టింది. తాజాగా ఐదైనా సిరీస్ కోసం జట్టును ప్రకటించే సమయంలో తప్పనిసరిగా ఫిట్‌నెస్‌ను పరిశీలించేందుకు యో యో టెస్ట్ నిర్వహించాలని వైద్యబృందం నుంచి సూచించినట్లుగా సమాచారం. దాంతో బీసీసీఐ యో యో టెస్ట్‌ను తప్పనిసరి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. క్రికెటర్లు బిజీ షెడ్యూల్‌తో ఇబ్బందులుపడుతున్న నేపథ్యంలో ఫెట్‌నెస్ టెస్ట్‌పై బీసీసీఐ ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చింది. తాజాగా ఆటగాళ్ల ఫామ్ లేమితో పాటు తరుచూ ఆటగాళ్లు గాయాలకు గురవుతుండడం ఇబ్బందికరంగా మారుతున్నది. ఈ క్రమంలో మళ్లీ బీసీసీఐ కఠినమైన యో యో టెస్ట్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల వరుస సిరీస్‌లలో టీమిండియా ఓటమిపాలైన నేపథ్యంలో బీసీసీఐ తప్పనిసరిగా ఆటగాళు అందరూ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక పరిస్థితుల్లో అనుమతి తీసుకున్న ఆటగాళ్లు తప్ప.. మిగతా వారంతా తప్పనిసరిగా దేశవాళీలో ఆడాల్సిందే. మరో వైపు జట్టు పని విధానంలో బీసీసీఐ పలు మార్పులు చేయబోతున్నట్లు తెలుస్తున్నది.

## బ్యాటింగ్ కోచ్‌ను నియమించనున్న బీసీసీఐ..! ఆసక్తిని వ్యక్తం చేసిన కెవిన్ పీటర్సన్!



గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్ తర్వాత హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా నియామకమయ్యాడు. ఆ తర్వాత బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్ బాధ్యతలు తీసుకోగా.. అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోషేట్‌ను అసిస్టెంట్ కోచ్‌లుగా బీసీసీఐ నియమించింది. ప్రస్తుతం టీమిండియాకు బ్యాటింగ్ కోచ్ అందుబాటులో లేడు. ఈ క్రమంలో బీసీసీఐ కొత్త బ్యాటింగ్ కోచ్‌ను నియమించాలని పరిశీలిస్తున్నది. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ దిగ్గజం కెవిన్ పీటర్సన్ భారత జట్టుకు బ్యాటింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిని చూపారు. వాస్తవానికి గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి టీమిండియా ప్రదర్శన ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ఒక టీ20 సిరీస్, ఒక వన్డే సిరీస్, రెండు మూడు టెస్టు సిరీస్‌లను ఆడింది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల్లో ఓటమిపాలైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలోనూ సిరీస్‌ను కోల్పోయింది. శ్రీలంకలో జరిగిన వన్డే సిరీస్‌లో ఓటమి మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో టీమిండియాకు బ్యాటింగ్ కోచ్‌ను నియమించేందుకు సన్నద్ధమవుతుందని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఓ ట్వీట్‌ను కెవిన్ పీటర్సన్ రీ ట్వీట్ చేస్తూ.. అందుబాటులో ఉన్నానంటూ స్పందించారు. ఇదిలా ఉండగా.. బీసీసీఐ సితాన్షు కొటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించేందుకు అవకాశం ఉందని ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. సీతాన్షు ప్రస్తుతం ఇండియా ఏ జట్టు హెడ్‌కోచ్‌గా కొనసాగుతున్నాడు. ఆయన పర్యవేక్షణలోనే ఇండియా ఏ జట్టు ఆస్ట్రేలియా పర్యటించింది. 2023 ఆగస్టులో టీమిండియా ఐర్లాండ్ పర్యటన సమయంలో రాహుల్ ద్రవిడ్ గైర్హాజరీలో సితాన్షు హెడ్‌కోచ్‌గా వ్యవహరించారు. ఈ సిరీస్‌లో బుమ్రా జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాడు.

# స్పోర్ట్స్

## ఫామ్‌లోకి వచ్చేందుకు డొమెస్టిక్ క్రికెట్ బెస్ట్ : యువరాజ్ సింగ్



ఫామ్‌లో లేని ఆటగాళ్లు ఏ ఎత్తులో ఉన్నా.. దేశవాళీ క్రికెట్ ఆడాలని భారత మాజీ బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్ సూచించాడు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ పేలవమైన ఆటతీరుతో విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఇద్దరి ఆటగాళ్లను దేశవాళీ క్రికెట్ ఆడాలని పలువురు మాజీలు సూచించారు. ఈ క్రమంలోనే యువరాజ్ సింగ్ ఫామ్ లేక ఇబ్బందిపడుతుంటే, సమయం ఉంటే ఖచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలని తాను భావించానని సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో పేర్కొన్నాడు. ప్రాక్టీస్‌కు ఇద్దే ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. సమయం ఉంటే.. ఎలాంటి గాయపడకపోయి ఉంటే దేశవాళీ క్రికెట్ కీలకమైందని తాను భావిస్తున్నానని తెలిపాడు. సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, హెడ్‌కోచ్ గంభీర్ డొమెస్టిక్ క్రికెట్ ప్రాధాన్యతను వివరించారు. జనవరి 23న మొదలయ్యే రంజీ ట్రోఫీ మ్యాచులకు ముందు రోహిత్ శర్మ ముంబయి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటున్నాడు. ఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ ఆడతాడా? లేదా? ఇంకా ఎలాంటి హింట్స్ ఇవ్వలేదు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మాన్ గిల్ తదితర ఇతర స్టార్ ఆటగాళ్లు తమ జట్ల తరఫున ఆడేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిడ్నీ టెస్టు సందర్భంగా రోహిత్ శర్మ తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి యువరాజ్ ప్రశంసించాడు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత గంభీర్ కోచింగ్ సామర్థ్యంపై విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో ఇద్దరినీ యూవీ వెనకేసుకువచ్చాడు. భారత్ సిరీస్‌లు గెలిస్తే ప్రశంసిస్తారని.. ఓడిపోతే విమర్శిస్తారన్నారు. తాను మాత్రం ఎప్పుడూ ఐదేళ్ల నుంచి మూడేళ్ల కాలంలో జట్టు గ్రాఫ్‌ని చూస్తానని చెప్పాడు. గంభీర్ ఇప్పుడే వచ్చాడని.. అతనికి మరింత సమయం కావాలనిని చెప్పాడు. రోహిత్ కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్‌ను సాధించాడని.. వన్డేల్లో ఫైనల్ వరకు తీసుకువెళ్లగలిగాడని తెలిపాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిల్స్ కట్టబెట్టినట్లుగా గుర్తు చేశారు. సిడ్నీ టెస్టుకు దూరంగా ఉండి మరొకరికి చాన్స్ ఇచ్చాడని.. గతంలో ఈ పని ఎందరు కెప్టెన్లు చేశారో తనకు చెప్పాలన్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0-3 తేడాతో ఓటమిని జీర్ణించుకోవడం కష్టమని యూవీ పునరుద్ఘాటించాడు.




## అజిత్ 'విడాముయర్చి' తెలుగు టైటిల్ ఇదే.!

తమిళ అగ్ర నటుడు అజిత్ ప్రస్తుతం కార్ రేసింగ్ పోటీల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా దుబాయ్‌లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది అజిత్ రేసింగ్ జట్టు. దీంతో నటుడిగానే కాకుండా రేసర్‌గా రాణించిన అజిత్‌పై ప్రశంసలు కురిపించారు ప్రముఖులు. ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి' ఏకే 62గా వస్తున్న ఈ సినిమాకు మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాను తెలుగులో పట్టుదల పేరుతో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ని నేడు 6.40 నిమిషాలకి జెమిని టీవీ వేదికగా లాంఛ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఎంత వాడు గాని తర్వాత అజిత్– త్రిష కాంబినేషన్‌లో ఈ సినిమా రానుండటంతో మూవీ భారీ అంచనాలు ఉన్నాయి.



## 'సంక్రాంతికి వస్తున్నాం' క్రేజీ రెస్పాన్స్

విక్టరీ వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదలై సూపర్ హిట్ టాక్?తో దూసుకుపోతోంది. రెండు రోజుల్లోనే ఈ సినిమా రూ.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. ఇక వీకెండ్?లో ఈ కలెక్షన్లు మరింత పెరిగే ఛాన్స్ ఉంది. సంక్రాంతి సెలవులు కావడం వల్ల థియేటర్‌కు ఫ్యామిలీ ఆడియెన్స్ క్యూ కడుతున్నారు. అన్ని థియేటర్లలో హౌస్ ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. టికెట్లు దొరకక థియేటర్ నుంచి తిరిగి వెళ్లిపోతున్న ప్రేక్షకులూ కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అదనంగా 220ం షోలను ప్రదర్శించాలని నిర్ణయించినట్లు మేకర్స్ పేర్కొన్నారు. సంక్రాంతి సెలవులకుతోడు వీకెండ్ కూడా కలిసి రావడం వల్ల మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జనవరి 10న రిలీజైన 'గేమ్‌ఛేంజర్' సినిమా షోలను తగ్గించి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు ఎక్స్‌ట్రా షోలు అడ్జెస్ట్ చేస్తున్నారు. అయితే ఈ రెండు సినిమాలకు నిర్మాత దిల్‌రాజు ఒక్కరే కావడం వల్ల స్క్రీన్‌లు పెంచే విషయంలో పెద్దగా సమస్యలు ఎదురు కాలేదని తెలుస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాను కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్? జానర్?లో తెరకెక్కించారు. ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, నరేశ్, వీటీ గణేశ్, సాయి కుమార్, మురళీ, పృథ్వీ రాజ్ తదితరులు ఆయా పాత్రలు పోషించారు. భీమ్స్? సిసిరొలియో సంగీతం అందించంగా, శ్రీ వేంకటేశ్వర బ్యానర్?పై దిల్?రాజు నిర్మించారు.

## చరణ్ కోసం బాబుని సాన పెడుతున్న బాబు

గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌తో ఓ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాన్వీకపూర్ చరణ్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగపతి బాబు ఆసక్తికర వీడియోని షేర్ చేశాడు.సినిమా టికెట్లు ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో తన పాత్ర మేక్ ఓవర్ కి సంబంధించిన ఓ వీడియోని షేర్ చేస్తూ జగపతి బాబు.. "చాలాకాలం తర్వాత బుచ్చిబాబు ఆర్‌సీ 16 కోసం మంచి పని పెట్టాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా అనిపించింది" అంటూ క్యాప్షన్ పెట్టాడు. ఈ వీడియోలో జగపతి బాబు లుక్ ని చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతూ కామెంట్స్ పెడుతున్నారు.

సినిమా టికెట్లు

ఒక గేమ్ బేస్డ్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాని రక్తి కట్టించేలా బుచ్చిబాబు రూపొందిస్తున్నారు. మట్టి లాంటి కథ ఇదని ఇప్పటికే రామ్‌చరణ్ చెప్పారు. ఇప్పటి వరకూ చేసిన చిత్రాలో ఈ చిత్రం ది బెస్ట్ అవుతుందని కూడా ఆయన ఓ వేదికపై వెల్లడించారు. ఉప్పెనతో భారీ విజయం అందుకుని నేషనల్ అవార్డు అందుకున్న దర్శకుడు సాన బుచ్చిబాబు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పూర్తిస్థాయి కథతో పకడ్బందీగా సెట్స్ మీదకెళ్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా 'గేమ్ ఛేంజర్' సినిమా చెర్రీ ఫ్యాన్స్ ని కాస్త నిరాశపరచడంతో అందరు ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు.





## ట్రెండ్ సెట్ చేస్తున్న మక్కల్ 'సెల్వన్'

మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి లీడ్ రోల్ నటిస్తున్న స్పెషల్ గ్లింప్స్ విడుదలైంది. అరుముగకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, యోగి బాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లు, రాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు.

కరణ్ భగత్ రౌత్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ పవర్ ఫుల్ మ్యూజిక్ తో గ్రేట్ కమర్షియల్ ఎంటర్ టైనర్ గా ఉంటుందని హామీ ఇచ్చింది. ఎడిటింగ్‌ను ఫెన్నీ ఆలివర్, ఆర్ట్ డైరెక్టర్ ఎ.కె. ముత్తు నిర్వహిస్తున్నారు. 7 ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అరుముగకుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా టైటిల్ టీజర్ విడుదలైన వెంటనే సంచలనం సృష్టించింది, మిలియన్ల వ్యూస్ సంపాదించి రికార్డులు సృష్టించింది. ఇప్పుడు, విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా, టీం ఈ ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది, ఇది అభిమానులలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది. ఈ గ్లింప్స్‌లో విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్'గా సాంప్రదాయ తమిళ దుస్తులు ధరించి, మలేషియాలోని విమానాశ్రయంలో డైనమిక్ గా నడుస్తూ, హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలలో పాల్గొంటూ, ఫెస్టివల్ లో డ్యాన్స్ చేస్తూ కనిపించడం అలరించింది. ఈ విజువల్స్ ఎంటర్ టైన్మెంట్, యాక్షన్ తో కూడిన సినిమాను సూచిస్తాయి, అభిమానులు విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్' పాత్రను పోషించడం ఆసక్తిని రేకెత్తించింది, తన విలక్షణమైన నటనా ప్రతిభకు పేరుగాంచిన విజయ్ సేతుపతి భారతీయ ప్రేక్షకుల హృదయాలను దోచుకోవడమే కాకుండా చైనాలో కూడా అంతకు మించి భారీ అభిమానులను సంపాదించుకున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com